తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
మంగళవారం
08 సెప్టెంబర్ 2026
పేజీలు : 8



## ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన కలెక్టర్

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్- 07( జనంసాక్షి )**
ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లో లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.మధిర మండలం నిధానపురం గ్రామానికి చెందిన ఏ. నాగిరెడ్డి  తమ పిల్లలకు షుగర్, కిడ్నీ వ్యాధి సమస్యలు ఉన్నాయని, దీనికి అవసరమైన మందులు సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చూడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం, కూసుమంచి మండలానికి చెందిన రైతులు తమకు ఆన్ లైన్ విధానం రద్దు చేసి ఎరువులు సరఫరా చేయాలని, భక్త రామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా చెరువులు నింపాలని, మార్క్ ఫెడ్ ద్వారా పెసర పంట కొనుగోలు నిమిత్తం కోనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వ్యవసాయ శాఖ అధికారికి రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో  జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## హెచ్‌సీఏ అండర్-16 జట్టుకు పాల్వంచ క్రీడాకారులు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్07 (జనంసాక్షి):**
హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అండర్-16 జట్టుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన నెక్స్ట్‌జెన్ క్రికెట్ అకాడమీ ఆటగాళ్లు సృజంత్, దివాకర్, ప్రిన్స్ ఎంపికయ్యారు. హెచ్‌సీఏ నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచి ఈ ముగ్గురు క్రీడాకారులు జట్టులో చోటు దక్కించుకున్నారు.క్రికెట్‌లో ప్రతిభను చాటుతూ హెచ్‌సీఏ అండర్-16 జట్టుకు ఎంపిక కావడం పట్ల తల్లిదండ్రులు, క్రీడాభిమానులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పాల్వంచకు చెందిన ముగ్గురు యువ క్రీడాకారులు ఒకేసారి హెచ్‌సీఏ జట్టుకు ఎంపిక కావడం స్థానిక క్రీడా రంగానికి గర్వకారణమని పలువురు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నెక్స్ట్‌జెన్ క్రికెట్ అకాడమీ కోచ్‌లు అభిమన్యు, శరత్ కళ్యాణ్, పవన్ సాయి, పవన్ సీలపోగు మాట్లాడుతూ సృజంత్, దివాకర్, ప్రిన్స్ ఎంపిక పట్ల ఆనందం వ్యక్తం చేశారు. క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో కష్టపడి సాధన చేస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. హెచ్‌సీఏ అండర్-16 జట్టులో రాణించి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్వంచకు మంచి పేరు తీసుకురావాలని వారు కోరారు.








## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో

# గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు

- ప్రతిపాదిత స్థలాలను పరిశీలించిన ఏఏఐ మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం..
- రన్‌వే, విమానాల అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్‌పై సాంకేతిక అధ్యయనం..
- రైల్వే లైన్ వల్ల కలిగే సాంకేతిక అంశాలపై ప్రత్యేక పరిశీలన
- సాంకేతిక సాధ్యాసాధ్యాల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి కీలకమైన ముందడుగు పడింది. విమానాశ్రయ ఏర్పాటుకు గుర్తించిన ప్రతిపాదిత స్థలాల సాంకేతిక సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) మల్టీ డిసిప్లినరీ సాంకేతిక బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం జిల్లాకు చేరుకుని మొదటి రోజు క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టింది. ఏఏఐ సభ్యులు భరత్ రెడ్డి, ఎండీ ఏవియేషన్ నేతృత్వంలోని సాంకేతిక బృందం ప్రతిపాదిత విమానాశ్రయ స్థలాలను పరిశీలిస్తూ భూమి లభ్యత, స్థల విస్తీర్ణం, భౌగోళిక పరిస్థితులు, రన్‌వే ఏర్పాటుకు అనుకూలత, విమానాల రాకపోకలకు అవసరమైన అప్రోచ్ ఫన్నెల్, నైట్ ల్యాండింగ్, భద్రతా ప్రమాణాలు తదితర అంశాలను అధ్యయనం చేసింది.
జిల్లాలో ప్రతిపాదిత గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ స్థలాలుగా సుజాతానగర్ మండలంలోని సీతంపేట, సుజాతానగర్, దుమ్ముగూడెం మండలంలోని దుమ్ముగూడెం, ములకలపల్లి మండలంలోని చాపరాలపల్లి, దమ్మపేట మండలంలోని పాల్వంచ/దమ్మపేట, చుంచుపల్లి మండలంలోని పెనగడప ప్రాంతాలను గుర్తించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా షెడ్యూల్ ప్రకారం ఆయా



ప్రాంతాల్లో స్థల పరిశీలన, సర్వే మరియు సాంకేతిక అంశాల పరిశీలన కొనసాగుతోంది.ఈ సందర్భంగా సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామిరెడ్డి, జిల్లా కలెక్టర్ అంకిత్‌తో ఏఏఐ సాంకేతిక బృందం సమావేశమై ప్రతిపాదిత విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన అంశాలపై సమగ్రంగా చర్చించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని విమానాశ్రయాన్ని అభివృద్ధి చేయడం, ఏటీఆర్-72 తరహా విమానాలతో పాటు పెద్ద ఎయిర్‌బస్ ఏ320/ఏ321 విమానాల రాకపోకలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చ జరిగింది.పెద్ద విమానాల రాకపోకలకు అనుగుణంగా సుమారు 2,500 నుంచి 2,700 మీటర్ల రన్‌వే అవసరమయ్యే అవకాశాలను సాంకేతిక బృందం పరిశీలించింది. రన్‌వే ఏర్పాటుకు అవసరమైన భూమి, భవిష్యత్ విస్తరణకు అవకాశాలు, నైట్ ల్యాండింగ్‌కు అవసరమైన సదుపాయాలు, భద్రతా పరికరాలు తదితర అంశాలపై కూడా అధ్యయనం చేస్తున్నారు. ప్రతిపాదిత ప్రాంతానికి సమీపంలో ఉన్న విద్యుదీకరించిన బొగ్గు రవాణా రైల్వే లైన్ కూడా సాంకేతిక బృందం పరిశీలనలో ప్రధాన అంశంగా నిలిచింది.

వార్తా లోపలి పేజీలో

## ఓటు హక్కును పరిరక్షించటమే

# ప్రధాన లక్ష్యం



### ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు విచారణకు  హాజరుకావాలి

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్-07( జనంసాక్షి)**
ప్రతి అర్హత కలిగిన పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. శ్రీ దేవసేన తెలిపారు.
ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం ఎస్ఐఆర్ కార్యక్రమంపై జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. దేవసేన, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ ఎ. దేవసేన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కును పరిరక్షించడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ ప్రతి అధికారికి అత్యున్నత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు ఎటువంటి ప్రధాన సమస్యలు గుర్తించలేదని తెలిపారు. క్షేత్రస్థాయిలో ప్రజలు, ఓటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, సందేహాలను రాజకీయ పార్టీల ప్రతినిధుల ద్వారా తెలుసుకోవడమే ఎన్నికల సంఘం ఉద్దేశ్యమని పేర్కొన్నారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు ఎప్పుడైనా తనను సంప్రదించి సమస్యలను తెలియజేయవచ్చని, చిన్న సమస్య అయినప్పటికీ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.
అర్హత లేని ఓటర్లను తొలగించడంతో పాటు, అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటమే ఎస్ఐఆర్ ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన ధృవపత్రాల్లో అవసరమైన ధృవ పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందని, అధికారులు తమ స్థాయిలో ధృవ పత్రం సమర్పణ నుంచి మినహాయింపు ఇవ్వలేరని పేర్కొన్నారు.వివాహిత మహిళల విషయంలో పేర్ల మార్పులు, పేర్లలో అక్షర దోషాలు, ఇతర చిన్నపాటి క్లరికల్ తప్పిదాలను స్వీయ ప్రకటన ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. మిగిలిన అంశాల్లో ఎన్నికల సంఘం సూచించిన ధృవ పత్రాల్లో ఒకదాన్ని తప్పనిసరిగా సమర్పించాల్సి ఉంటుందని వివరించారు.
ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ఓటర్లకు అవసరమైన ధృవ పత్రాలపై రాజకీయ పార్టీలు అవగాహన కల్పించి, విచారణకు హాజరయ్యే సమయానికి సంబంధిత పత్రాలను సిద్ధంగా ఉంచుకునేలా సహకరించాలని కోరారు. రాజకీయ అనుబంధంతో సంబంధం లేకుండా ప్రతి అర్హత కలిగిన ఓటరుకు ఓటు హక్కు కల్పించేందుకు ఎన్నికల సంఘం అందరితో సమన్వయంతో పనిచేస్తుందని తెలిపారు.జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ మిగతా 2లో

# ఆరుగ్యారెంటీలు... కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలుచేయాలని నిరసన

## - ప్రజావాణిలో ఎంపీడీవోకు బీఆర్ఎస్ శ్రేణుల వినతి



బూర్గంపహాడ్ సెప్టెంబరు 07 (జనంసాక్షి) కాంగ్రెస్ 1000 రోజుల పాలన వైఫల్యాల్లో భాగంగా ఆరు గ్యారెంటీలు... ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలుచేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవోకు మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, బీఆర్ఎస్ శ్రేణులు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు అమలుచేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. మహిళలకు రూ.2500, బీడీ కార్మికులకు పెన్షన్ రూ.4వేలు, వృద్ధులకు రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ఆర్థికసాయంతో పాటు తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు, ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు, నిరుద్యోగ భృతి తదితర హామీలను గాలికొదిలేసి కాంగ్రెస్ దగా పాలన సాగిస్తుందని మండిపడ్డారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపి అనంతరం ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ భూపెల్లి నర్సింహారావుతో పాటు మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, నాయకులు కొనకంచి శ్రీను, దారం కృష్ణారెడ్డి, గోనెల నాని, సాదిక్ పాషా, సోము లక్ష్మీచైతన్యరెడ్డి, పూర్ణ, బెజ్జంకి కనకాచారి, గుల్మహ్మద్, బానోత్ శ్రీను నాయక్, మోహన్, పంగి సురేష్, సర్పంచ్లు గుమ్మడి కృష్ణవేణి, బానోత్ సరోజ, కె.వి రమణ, సాలయ్య, అన్ని అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# నాయుడుపేట కూడలికి పచ్చని కళ

## -సుందరీకరణతో మారుతున్న రూపురేఖలు
## -త్వరలో మంత్రి పొంగులేటి చేతుల మీదుగా ప్రారంభం





ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 7(జనంసాక్షి): ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేట కూడలి పచ్చదనంతో కళకళలాడుతోంది. గతంలో ఖాళీ ప్రదేశాలు, దుమ్ము, ధూళితో కనిపించిన కూడలి.. ప్రస్తుతం పచ్చని మొక్కలతో ఆహ్లాదకర వాతావరణాన్ని సంతరించు కుంది. ప్రధాన రహదారుల మధ్యలో మొక్కలను నాటి పెంచడంతో కూడలి రూపురేఖలు మారుతున్నాయి.నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే నాయుడుపేట కూడలి పరిసరాల్లో పచ్చదనం పెంపొందించడంతో వాహనదారులు, బాటసారులను, స్థానికులను ఆకట్టుకుంటోంది.మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణతో పాటు కూడలి సుందరీకరణకు దోహదపడుతోందని స్థానికులు పేర్కొంటున్నారు.మున్సిపాలిటీ పరిధిలోని ఇతర ప్రధాన కూడళ్లను సైతం ఇదే తరహాలో అభివృద్ధి చేసి పచ్చదనంతో మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

**మరికొద్ది రోజుల్లో ప్రారంభం**

**అవుతుంది:కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి**

నాయుడుపేట కూడలి సుందరీకరణ పనులు పూర్తికావస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. మరికొద్ది రోజుల్లో స్థానిక పాలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా కూడలిని ప్రారంభించనున్నట్లు ఆయన 'జనం సాక్షి' దినపత్రిక కు తెలిపారు.

# ఓటు హక్కును పరిరక్షించటమే ప్రధాన లక్ష్యం

ఖమ్మం జిల్లాలో మొత్తం 12 లక్షల 43 వేల 781 మంది ఓటర్లు ఉన్నారని,ఇప్పటి వరకు ఒక లక్ష 75 వేల 858 మంది ఓటర్లకు నోటీసులు జెనరేట్ కాగా, ఒక లక్ష 36 వేల 787 నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 17 వేల 555 విచారణలు నిర్వహించామని తెలిపారు.ఎన్నికల సంఘం అనుమతించిన ధృవ పత్రాలపై ప్రతి ఓటరుకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అవసరమైన ధృవ పత్రాలు లేని ఓటర్లకు సంబంధిత ధృవ పత్రాలు పొందేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారంలో వివరాలు ఉన్నప్పటికీ మ్యాపింగ్‌లో సమస్యలు ఉంటే విచారణ సమయంలో పరిశీలించి పరిష్కరిస్తామని పేర్కొన్నారు. పేర్లలో తప్పులు, ఇతర క్లరికల్ పొరపాట్లు, వివాహిత మహిళల విషయంలో పేర్ల మార్పులు వంటి అంశాలను బీఎల్ఓకు స్వీయ ప్రకటన సమర్పించడం ద్వారా సరిచేసుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎక్కడైనా ఉద్దేశపూర్వకంగా అవకతవకలకు పాల్పడినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఖమ్మం జిల్లాలో ఎస్ఐఆర్ ప్రక్రియకు అన్ని రాజకీయ పార్టీలు ఇప్పటివరకు సహకరిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల కోసం ఎస్ఐఆర్‌పై మరోసారి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎస్ఐఆర్ నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని, అవసరమైన ధృవ పత్రాలు లేని వారికి సంబంధిత ధృవ పత్రాలు పొందేందుకు వీలైనంత సహకారం అందిస్తామని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.రాజకీయ పార్టీల ప్రతినిధులు మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభం నుంచే జిల్లా కలెక్టర్ ప్రజలకు, రాజకీయ పార్టీలకు మంచి అవగాహన కల్పించారని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఎదురైన సమస్యలను పరిష్కరిస్తున్నారని పేర్కొన్నారు.ఓసీ వర్గానికి చెందిన కొంత మంది ఓటర్లు తమ ధృవ పత్రాలు సమర్పించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పెద్దగా సమస్యలు లేవని, పట్టణ ప్రాంతాల్లో మాత్రమే కొన్ని సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. జన్మతేదీ ఆధారంగా తల్లిదండ్రుల ధృవ పత్రాలు సమర్పించాలని కోరుతున్న సందర్భాల్లో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం ఆర్డీఓ శ్రీనివాస్, కలెక్టరేట్ ఎలక్షన్ విభాగం పర్యవేక్షకులు రాజు, డీటీ అన్సారీ, బీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి బెల్లం వేణుగోపాల్, ఐఎన్ సి పార్టీ ప్రతినిధి అన్నెం గోపాల్ రావు, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి స్వర్ణ సుబ్బారావు, సీపీఐ(ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, టిడిపి పార్టీ ప్రతినిధి సిహెచ్. రాజరాజేశ్వరి, బిజెపి పార్టీ ప్రతినిధి వి. రాజేష్, బీఆర్ఎస్ వి ప్రతినిధి ఎల్. సతీష్ బాబు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర సుబ్బారావు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంఎల్ఏ సండ్ర



పెనుబల్లి సెప్టెంబర్ 7 జనంసాక్షి సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య సోమవారం పెనుబల్లి మండలం ఎర్ర బంజర గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ ఎర్ర సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇటీవల సుబ్బారావు గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న సండ్ర సుబ్బారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కనగాల వెంకటరావు, మాజీ జెడ్పిటిసి చెక్కిలాల మోహన్ రావు, చెక్కిలాల లక్ష్మణరావు తోట రామారావు వేణుబాబు తదితరులు పాల్గొన్నారు.

# నిందితులను కఠినంగా శిక్షించాలి - కట్రం స్వామి

ములకలపల్లి సెప్టెంబర్ 7 జనంసాక్షి : హైదరాబాద్ ప్రైమ్ కేర్ హాస్పటల్లో స్టాఫ్ నర్స్ గా పని చేస్తున్న ఊరికే శిరీషను దారుణంగా చంపేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని తెలుగుదేశం పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ ఇన్చార్జ్ కట్రం స్వామి డిమాండ్ చేశారు. టీడీపీ మండల కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం నాడు చౌటిగూడెం లోని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించడానికి వెళ్లిన టిడిపి బృందం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం నడిబొడ్డున ఇంత దారుణం జరగటం చాలా దురదృష్టం అని, ప్రభుత్వం కఠినమైన నిర్ణయం తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని, వారి కుటుంబానికి కోటి రూపాయలు ఎక్స్గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఖమ్మం పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, ములకలపల్లి సీనియర్ నాయకులు కోమల దుర్గాప్రసాద్, తెల్లం రామారావు తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీలో మహిళా ఎమ్మెల్యేలపై దాడి.. భగ్గుమన్న బిఆర్ఎస్ !

## ○ బీఆర్ఎస్ శ్రేణుల నల్లబ్యాడ్జీల నిరసన.. ○ సీఎం స్పందించి క్షమాపణ చెప్పాలని డిమాండ్..



బూర్గంపహాడ్ సెప్టెంబరు 07 (జనంసాక్షి) అసెంబ్లీ సాక్షిగా మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేసి అవమానించడం అమానుషమని బీఆర్ఎస్ నాయకులు భగ్గుమన్నారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆదేశాల మేరకు సోమవారం బూర్గంపహాడ్ మండల కేంద్రంలో మాజీ జడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు.అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన ఈ నిరసనలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. అసెంబ్లీకి వెళ్తున్న మహిళా ఎమ్మెల్యేను జుట్టు పట్టుకుని బయటకు పంపించడం తీవ్రంగా బాధ కలిగించిందన్నారు. అసెంబ్లీ సాక్షిగా మహిళలకు అవమానం జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. మహిళల జుట్టు పట్టుకోవడం, చీరలు లాగడం వంటి ఘటనలు ప్రజాస్వామ్యానికి మచ్చ అని వారు విమర్శించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే స్పందించి బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మరింత పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జలగం జగదీష్, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, సారపాక పట్టణ అధ్యక్షుడు కొనకంచి శ్రీను, గోనెల నాని, దారం కృష్ణారెడ్డి, సాధిక్ పాషా, బెజ్జంకి కనకాచారి, సోము లక్ష్మీచైతన్యరెడ్డి, పూర్ణ, భూపెల్లి నర్సింహారావు, గుల్మహ్మద్, సాలయ్య, సర్పంచ్ గుమ్మడి కృష్ణవేణి, మండల నాయకులు, అనుబంధ సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ఎన్నికల హామీలను అమలు చేయాలి

## - బీఆర్ఎస్ సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలి - ప్రజావాణిలో ఎంపీడీవోకు వినతిపత్రం

**మునగాల, సెప్టెంబర్ 7(జనంసాక్షి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను పునరుద్ధరించి అర్హులైన ప్రజలందరికీ అందించాలని డిమాండ్ చేస్తూ మునగాల బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో రమేష్ దీన్ దయాళ్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలైన మహిళలకు నెలకు 2 వేల 5 వందల రూపాయలు, రైతులకు ఎకరాకు 15 వేల రూపాయలు, రైతు భరోసా, వ్యవసాయ కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయలు, వరికి క్వింటాల్‌కు 5 వందల రూపాయల బోనస్, నిరుద్యోగ భృతి, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్ల పెంపు, రూ. 2 లక్షల పంట రుణమాఫీ తదితర హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన కేసీఆర్ కిట్, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పెన్షన్లు, కంటి వెలుగు, గొర్రెల పంపిణీ, దళితబంధు, బీసీ బంధు తదితర సంక్షేమ పథకాలను నిలిపివేయకుండా పునరుద్ధరించాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు, గతంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను కొనసాగించి పేదలు, రైతులు, మహిళలు, విద్యార్థులు, కార్మికులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునగాల బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్, సీనియర్ నాయకులు సుంకర అజయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, రామిరెడ్డి,



సర్పంచులు రాంపంగ సుందర్, బూసి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ కోల ఉపేంద్రరావు, గ్రామ శాఖ అధ్యక్షులు ఉడుం కృష్ణ, ఆదిరెడ్డి, గోవిందరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకన్న, బొమ్మ చిన్న వెంకన్న, సీనియర్ నాయకులు ప్రదీప్ సార్, సైదా, మణికంఠ, దొంగరి శ్రీనివాస్, సైదులు, లక్ష్మయ్య, నరసయ్య, ఆంజనేయులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



### అక్రమ అరెస్టులకు నిరసనగా బీఆర్ఎస్ రాస్తారోకో

**మునగాల, సెప్టెంబర్ 7(జనంసాక్షి):**
అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను అక్రమంగా అడ్డుకొని అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా నిరసిస్తూ మునగాల బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సోమవారం రాస్తారోకో నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళు_న్న ప్రజాప్రతినిధులను అడ్డుకొని అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని, కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునగాల బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తొగరు రమేష్, సీనియర్ నాయకులు సుంకర అజయ్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్లు కందిబండ సత్యనారాయణ, రామిరెడ్డి, సర్పంచులు రాంపంగ సుందర్, బూసి వెంకటేశ్వర్లు, మాజీ జెడ్పీటీసీ కోల ఉపేంద్రరావు, గ్రామ శాఖ అధ్యక్షులు ఉడుం కృష్ణ, ఆదిరెడ్డి, గోవిందరెడ్డి, లక్ష్మారెడ్డి, వెంకన్న, బొమ్మ చిన్న వెంకన్న, సీనియర్ నాయకులు ప్రదీప్ సార్, సైదా, మణికంఠ, దొంగరి శ్రీనివాస్, సైదులు, లక్ష్మయ్య, నరసయ్య, ఆంజనేయులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.




### ఫీజు బకాయిలపై బీజేపీ పోరుబాట

**వలిగొండ, సెప్టెంబర్ 7 (జనం సాక్షి )**
ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన ధర్నాకు వెళ్లకుండా వలిగొండ మండల నాయకులు, కార్యకర్తలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని అరెస్టులతో ఆపలేరని అన్నారు. అరెస్టయిన వారిలో బంధారపు లింగస్వామి, కనతాల అశోక్‌రెడ్డి, రాచకొండ కృష్ణ, మందుల నాగరాజు, బుంగమట్ల చిన్న మహేష్ తదితరులు ఉన్నారు.

### బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు పై చర్యలు తీసుకోవాలి



తుంగతుర్తి సెప్టెంబర్ 7 (జనంసాక్షి)
రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న శాసనసభ దళిత స్పీకర్ను కించపరిచేలా మాట్లాడిన బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు పై చర్యలు తీసుకోవాలని తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న అన్నారు, సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు మాట్లాడడం ఏమాత్రం సమంజసం కాదని ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ వ్యవస్థను శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనని అన్నారు, ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ఉన్న గౌరవాన్ని ప్రతి ఒక్కరు కాపాడవలసిన బాధ్యత ఉందన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఆయనను సస్పెండ్ చేయడంతో పాటు శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలన్నారు, ఈ విషయంపై బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ సమాధానం చెప్పి క్షమాపణ చెప్పాలని అన్నారు, ఇప్పటికైనా బిఆర్ఎస్ నాయకులు బాధ్యతలు వ్యవహరించి రాజ్యాంగ వ్యవస్థల గౌరవాన్ని కాపాడాలని అన్నారు

### రావి నారాయణ రెడ్డి ఆశయ సాధనకు కృషి చేయాలి సిపిఐ నాయకులు

**జనం సాక్షి సెప్టెంబర్ (07)ఆత్మకూర్ (ఎం):**
తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, పేద ప్రజల హక్కుల పోరాట నేత కామ్రేడ్ రావి నారాయణ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆత్మకూర్ మండల కేంద్రంలో అఖిఎ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిఎ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు మాట్లాడుతూ.. భూస్వామ్య వ్యవస్థ, వెట్టిచాకిరి నిర్మూలనకు రావి నారాయణ రెడ్డి చేసిన పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మారుపాక వెంకటేష్, నాయకులు గుర్రం రాజమణి, జల్ది రాములు, మారుపాక అంజయ్య, కలవల నరసయ్య, మజ్జిగ నరసయ్య, అంబోజు రాములు, దామోదర్ రెడ్డి, ఎండి అంజద్, అల్లంశెట్టి వెంకటేష్, ఇంజమూరి నరసింహ, పడకంటి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

# చినుకు పడక.. పంటలు ఎండిపోతున్నాయ్!

**వర్షాభావంతో పత్తి రైతుల విలవిల**
**పూత దశలోనే రాలిపోతున్న పత్తి పూత**
**బోర్లలో నీరు అడుగంటడంతో వరి పంటకూ తప్పని కష్టం**

**తిరుమలగిరి (సాగర్) సెప్టెంబరు 07 (జనంసాక్షి) :**
మండలంలో వర్షాభావ పరిస్థితులతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో సకాలంలో వర్షాలు కురవకపోవడంతో పత్తి, వరి సాగు చేస్తున్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంటల కోసం పెట్టిన పెట్టుబడులు చేతికొచ్చి అప్పులు తీరుతాయో లేదోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాన చినుకు కోసం ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు.

**పూత దశలో పత్తికి దెబ్బ**
మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సుమారు 18,450 ఎకరాలలో పత్తి సాగు చేశారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో భూమిలో తేమ తగ్గిపోయింది. ప్రస్తుతం పత్తి మొక్కలు పూత దశకు చేరుకున్నప్పటికీ, తగినంత నీరు అందక పూత రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని వాపోతున్నారు.

**పెట్టుబడి పెట్టి.. ఆకాశం వైపు చూపులు**
పత్తి సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలకు రైతులు భారీగా ఖర్చు చేశారు. పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు ముఖం చాటేయడంతో పెట్టుబడులు తిరిగి వస్తాయా? అనే ఆందోళన నెలకొంది. వర్షం కురిస్తేనే పంట కొంతవరకు కోలుకునే అవకాశం ఉందని రైతులు చెబుతున్నారు.

**బోర్లలో నీరు లేక వరికీ కష్టాలే**
వర్షాభావ ప్రభావం పత్తి పంటకే పరిమితం కాలేదు. వ్యవసాయ బోర్ల కింద 11,568 ఎకరాల విస్తీర్ణం లో వరి సాగు చేస్తున్న రైతులపైనా ప్రభావం పడుతోంది. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లలో నీటి లభ్యత తగ్గిపోయింది. దీంతో మోటార్లు సక్రమంగా నీటిని తోడలేకపోతుండటంతో వరి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది.

**భూగర్భ జలాలు అడుగంటడంతో ఆందోళన**
మండలంలోని పలు ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలు పడిపోతుండటంతో బోర్లపై ఆధారపడి సాగు చేస్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు లేకపోవడం, బోర్లలో నీరు తగ్గిపోవడం వల్ల పంటలను కాపాడుకోవడం కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనితో పాటు 212 ఎకరాలలో కంది,సుమారు 500 ఎకరాలలో మిర్చి



సాగుచేస్తున్నారు.

**ఆదుకోవాలని రైతుల వేడుకోలు**
తీవ్ర వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు మండలంలోని పంటల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతులు కోరుతున్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం తగిన సహాయం అందించాలని, అవసరమైన చోట సాగునీటి సదుపాయాలు కల్పించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా వర్షాలు కురిసి పంటలు నిలబడాలని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

### అర్వపల్లిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో

జాజిరెడ్డిగూడెం మండల **(జనంసాక్షి):**
అసెంబ్లీలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని నిరసిస్తూ అర్వపల్లిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మాజీ జడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు గుండగాని సోమేష్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వల్లపు గంగయ్య, మండల నాయకులు పంది యుగంధర్, బొడ్డు రామలింగయ్య, తడూరి రామకోటి, వివిధ గ్రామాల సర్పంచ్ లు కర్నాటి వెంకన్న, అంకిరెడ్డి వీరాంజనేయులు, నున్న యాదగిరి,మేడి వీరస్వామి, బానోతు సైదులు, నాయకులు పొట్టేపాక సైదులు, గోసుల విజయ్, దుబ్బాక యల్లంరాజు, మిరియాల వెంకన్న, లింగంపల్లి రవీందర్, కట్టెల మల్లేష్, బైరబొయిన వెంకన్న, మామిడాల రాజలింగం, భైరబోయిన పెద్దయ్య, దావుల లింగయ్య, కనుకు నాగరాజు, యల్లెంల శ్రీకాంత్, కేలోతు రవీందర్, మనుబోతుల నరేష్, బింగి సాయి, బింగి మధు, భైరబోయిన సురేష్, నీలం అజయ్, మాగి పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ ఎమ్మెల్యేల పై పోలీసుల దాడి పట్ల నిరసన



తుంగతుర్తి సెప్టెంబర్ 7 (జనం సాక్షి)
తెలంగాణ అసెంబ్లీ గేటు వద్ద టిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన తోపులాట దాడి నీ నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ శ్రేణుల ఆధ్వర్యంలో వేరు రోడ్డుపై ధర్నా రాస్తారోకో నిర్వహించారు, సందర్భంగా మాజీ ఎంపీపీ మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు అందరికీ ఉంటుందని ప్రజా ప్రతినిధుల పట్ల పోలీసులు ఈ విధంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు వ్యతిరేకంగా టిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు టీ షర్టులపై స్లోగాలను ఉన్నాయనే కారణంగా పోలీసులు వారిని గేటు వద్ద నిలిపివేయడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మూడేండ్ల దగా పాలనను అసెంబ్లీ లో నిలదీస్తారని దురుద్దేశం తోనే కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సలహా ప్రకారమే పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని అన్నారు, రాజీవ్ గాంధీ నల్ల చొక్కా ధరించి పార్లమెంట్ కు వెళ్ళ వచ్చు కాని మా పార్టీ ఎమ్మెల్యేలు అసెంబ్లీ కి రావడం నేరమా అన్నారు. ప్రజల తరఫున ప్రజాసమస్యలమీద అసెంబ్లీ లో నిలదీస్తే జవాబు చెప్పే ధైర్యం లేని ముఖ్యమంత్రి. ఈ విధమైన దాడులు చేయించాదాన్ని చీకటి రోజుగా అభివర్ణించ్చారు. అనంతరం మూడేళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీ లను నెరవేర్చాలని కోరుతూ ప్రజావాణిలో అధికారులకు మెమోరాండానికి సమర్పించారు, ఈ కార్యక్రమం లో జిల్లా నాయకులు గుండగాని రాములుగౌడ్ మండల నాయకులు తునికి సాయిలు గుండగాని దుర్గయ్య మల్యాలా రాములు గుడిపాటి వీరయ్య నాగమల్లు. గోపగాని వెంకన్న దశరథనాయక్ మాజీ సర్పంచ్ లు విరోజీనాయక్. యాకూ నాయక్. మాతంగి కరుణాకర్ సోమేశ్ భాస్కర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు



# యువత స్వశక్తితో ఎదగాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
యువత స్వశక్తితో ఎదిగి ఆదర్శంగా నిలవాలని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన స్మాష్ కేఫ్ అండ్ రెస్టారెంట్ ను మేఘన ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కేఫ్ నిర్వాహకులు 5వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు మద్దెబోయిన తిరుమలేశ్, నిర్వాహకులు మద్దెబోయిన సాయిరాంకు శుభాకాంక్షలు తెలిపారు.వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించి వారి మన్ననలను పొందాలని అన్నారు.ప్రస్తుత పోటీ వాతావరణంలో నాణ్యత, పరిశుభ్రత, మంచి రుచితో పాటు సంతృప్తికరమైన సేవలు అందించడం ద్వారా స్మాష్ కేఫ్ మంచి ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం 5వ వార్డ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పఠాన్ నబీ ఖాన్, మద్దెబోయిన శ్రీనివాస్, తన్నీరు వెంకన్న, పెద్దగట్టు మాజీ డైరెక్టర్ నల్లబోతు నాగరాజు యాదవ్, మాజీ ఎంపీటీసీ ధరావత్ సాగర్, నాయకులు రాపర్తి నాగరాజు, కొత్తపల్లి వెంకన్న, సయ్యద్ జావేద్, సంజ్యల వినయ్ వర్మ, అనంతుల నవీన్, పిల్లల నాగరాజు,శ్రీనాథ్, వంశీ, లోకేష్, బోజేష్, విక్రమ్, రాకేష్, హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



# జాజిరెడ్డిగూడెం మండలంలో డిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం

**సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**ఉపాధ్యాయ ,విద్యారంగ సమస్యల పరిష్కారంలో డిటిఎఫ్ ముందంజలో ఉంటుందని డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రేపాకలింగయ్య , జిల్లా అధ్యక్షులు షేక్ ఉమర్ అన్నారు . జాజిరెడ్డిగూడెం మండలంలో డిటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వానికి మూడు సంవత్సరాల సమయం ఇచ్చినప్పటికీ ఏ సమస్యను పరిష్కరించలేదని ఇంకా రెండు సంవత్సరాల గడువు కోరడం విడ్డూరంగా ఉందని అన్నారు. పెండింగ్ లో ఉన్న పి.ఆర్.సి, డీ ఏ లు,బకాయిల సాధన కోసం సెప్టెంబర్ 10న హైదరాబాదులో జరగబోయే సమస్యల సాధన సభ కొరకు అధిక సంఖ్యలో ఉపాధ్యాయ , ఉద్యోగ,పెన్షనర్ , కార్మికులు అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. కేజీబీవీ , గురుకుల , మోడల్ స్కూల్ ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని కోరారు . ఈ కార్యక్రమంలో డిటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ నకిరే??కంటి వెంకన్న , జిల్లా కార్యదర్శులు ఎండి సాహెబ్ అలీ, ఫజల్ అబ్ ఖాన్ , మండల కన్వీనర్ పి నరసింహా చారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిలపై బిజెపి పోరు- నేతల అక్రమ అరెస్టు

గరిడేపల్లి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):
ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విడుదల కోసం జీవో 97 ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ తలపెట్టిన చలో ఇందిరా పార్క్ కార్యక్రమానికి వెళ్తున్న గరిడేపల్లి మండల బీజేపీ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీజేపీ నాయకులు తెలిపారు.ఫీజు బకాయిలు చెల్లించకుండా 40 లక్షల మంది విద్యార్థులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని, పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని ఆరోపించారు.బీజేపీ రాష్ట్ర అధ్యక్షుల ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలతారెడ్డి ఆదేశానుసారం చలో ఇందిరా పార్క్ కార్యక్రమానికి బయలుదేరిన నేతలను కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులతో అరెస్టు చేయించిందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్ మెంట్ విడుదలయ్యే వరకు బీజేపీ ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.అరెస్టు అయిన వారిలో గరిడేపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు కుక్కడపు వెంకటేశ్వర్లు గౌడ్, మండల ఉపాధ్యక్షులు నర్సింహా నాగసైదులు గౌడ్, కె.రాములు, శ్రీకాంత్, పగిడి రాధాకృష్ణ, గుగులోతు రాజు నాయక్ తదితరులు ఉన్నారు.





# బిజెపి నాయకుల ముందస్తు అరెస్టులు

**తుంగతుర్తి సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**
బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పిలుపుమేరకు రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వర్ రావు ఆదేశానుసారం విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల కొరకు చలో అసెంబ్లీ కార్యక్రమం కు వెళ్లకుండా ముందస్తు గా మండల కేంద్రంలో బిజెపి నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు, ఈ సందర్భంగా ఆ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు నారాయణదాస్ నాగరాజు మాట్లాడుతూ అరెస్ట్ లతో భారతీయ జనతా పార్టీ నాయకులను, కార్యకర్తలను అడ్డుకుని ఫీజులు బకాయి – బీజేపీ లడాయి కార్యక్రమం చేపట్టకుండా కుట్ర పూరితంగా పోలీసులతో అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు.ఎంతోమంది విద్యార్థుల ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వలన వారి సంబంధిత కళాశాలలో సర్టిఫికెట్స్ ఇవ్వకపోవడం వలన మరియు ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ వైఖరి వలన ఉన్నత చదువులకు దూరం అవుతున్నారన్నారు.అరెస్ట్ అయినవారిలో తుంగతుర్తి సర్పంచ్ మల్లెపాక సాయిబాబు, జిల్లా కౌన్సిల్ మెంబర్ కత్తుల నరేష్, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రఫిక్ వార్డ్ మెంబర్స్ రవి, వెంకన్న, సందీప్, బీజేవైఎం జిల్లా నాయకులు పోడేటి సాయికృష్ణ, భరత్ తదితరులు ఉన్నారు

# అక్రమ అరెస్టులతో బీజేపీ ఉద్యమాన్ని ఆపలేరు...

**చింతపల్లి, సెప్టెంబర్ 07(జనం సాక్షి)**
విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు చెల్లించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు.అక్రమ అరెస్టులతో బీజేపీ ఉద్యమాన్ని అణచివేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోయే కాలంలో విద్యార్థులే ముందుండి గద్దె దింపడం ఖాయమని బీజేపీ నాయకులు హెచ్చరించారు.ఈ ముందస్తు అరెస్టులలో భాగంగా చింతపల్లి బూత్ అధ్యక్షులు గజ్జె అభినవ్, బీజేపీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్, బీజేవైఎం మండల నాయకులు కడారి సతీష్ యాదవ్, కడారి కృష్ణ లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.




# 420 హామీలపై కాంగ్రెస్ సర్కార్‌ను నిలదీసిన బీఆర్ఎస్

## కాంగ్రెస్ సర్కార్‌పై గుర్రంపోడు బిఆర్ఎస్ ఫైర్



**గుర్రంపోడు, సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**
కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి వెయ్యి రోజుల పాలన సాగుతున్నా, ఎన్నికల వేళ ప్రజలకిచ్చిన 420 హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ధ్వజమెత్తారు. నాగార్జునసాగర్ మాజీ శాసనసభ్యులు నోముల భగత్ కుమార్ పిలుపు మేరకు, గుర్రంపోడు బిఆర్ఎస్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు నాగులవంచ తిరుపతిరావు ఆధ్వర్యంలో సోమవారం గుర్రంపోడు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న 'ప్రజా పాలన' కార్యక్రమంలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ వజ్జ ధనుంజయ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ప్రజలకు నమ్మబలికిన 6 గ్యారంటీలతో పాటు మరెన్నో వాగ్దానాలను తుంగలో తొక్కిందని ఆరోపించారు. వెయ్యి రోజులు గడుస్తున్నా రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం కాలేదని మండిపడ్డారు. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చే వరకు ప్రజల పక్షాన బిఆర్ఎస్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ ముఖ్య నాయకులు, సర్పంచ్ లు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కీతవారిగూడెంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

గరిడేపల్లి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):
కీతవారిగూడెం గ్రామంలోని శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్టా మహోత్సవం వైభవంగా నిర్వహించారు.ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ దక్షిణామూర్తి, శ్రీ కాలభైరవ, శ్రీ చండీశ్వర స్వాముల విగ్రహ ప్రతిష్ట చేపట్టారు. ఈ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా దక్షిణామూర్తి, కాలభైరవ ఆలయాలు లేకపోవడంతో కీతవారిగూడెంలో ప్రతిష్టించడం విశేషంగా భక్తులు భావిస్తున్నారు. ఉదయం సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహవచనం, యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ట, కళాన్యాసం, మహా పూర్ణాహుతి, మహదాశీర్వచనం, వేద స్వస్తి, విశేషాలంకరణ, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.కాలభైరవ విగ్రహ దాతలుగా రాయప్రోలు శ్రీరామయ్య శర్మమయూరి దంపతులు, దక్షిణామూర్తి విగ్రహ దాతలుగా ఆచార్యగూడెం వాస్తవ్యులు మైలారిశెట్టి రవి లక్ష్మీ దంపతులు, చండీశ్వర విగ్రహ దాతలుగా హుజూర్ నగర్ వాస్తవ్యులు పెద్ది శ్రీనివాస్, పుష్పావతి దంపతులు వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

# గణేష్ మండపాలకు ఆన్‌లైన్ అనుమతులు తప్పనిసరి

## చౌటుప్పల్ సీఐ మన్మధ కుమార్



**చౌటుప్పల్, సెప్టెంబర్ 07 (జనంసాక్షి)**
వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల ఏర్పాటుకు అవసరమైన పోలీస్ అనుమతులను ఆన్‌లైన్ ద్వారానే పొందాలని చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి .మన్మధ కుమార్ స్పష్టం చేశారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... వినాయక మండపాలు ఏర్పాటు చేయాలనుకునే నిర్వాహకులు ముందుగా తెలంగాణ స్టేట్ పోలీస్ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులో మండపం ఏర్పాటు చేసే ఖచ్చితమైన ప్రదేశం, ఉత్సవ కమిటీ నిర్వాహకుల వ్యక్తిగత వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని క్షేత్రస్థాయి పోలీస్ అధికారులు పరిశీలించిన అనంతరం ఆన్‌లైన్ ద్వారానే డిజిటల్ ఎన్ ఓ సి ని జారీ చేస్తారని తెలిపారు. అనుమతి లేని మండపాలకు ఆస్కారం లేదన్నారు. మండపాల ఏర్పాటులో భద్రతా ప్రమాణాలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రధానంగా రహదారులపై ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చూసుకోవాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల నివారణకు తగిన భద్రతా చర్యలు, అగ్నిప్రమాద నియంత్రణ ఉపకరణాలు అందుబాటులో ఉంచుకోవాలని పేర్కొన్నారు. అలాగే శబ్ద కాలుష్య నిబంధనలను అతిక్రమించకుండా పరిమితికి లోబడి మాత్రమే సౌండ్ సిస్టమ్స్ వినియోగించాలని హెచ్చరించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునేందుకు ప్రజలు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు పోలీసులతో సహకరించాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి లేదా సమస్య తలెత్తితే వెంటనే 100 లేదా 112 నంబర్లకు ఫోన్ చేసి పోలీస్ సహాయం పొందవచ్చని తెలిపారు..

## ఈ నెల 9న ఉచిత కంటి వైద్య శిబిరం

**సూర్యాపేట (జనంసాక్షి) :**
జిల్లా కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘ కార్యాలయంలో నేడు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం సూర్యాపేట మండల యూనిట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదగాని నాగేశ్వరరావు, శనగల యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు.శ్రీ కంటి హాస్పిటల్, సూర్యాపేట వారి సౌజన్యంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.ఈ వైద్య శిబిరంలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు.ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.పెన్షనర్లు,ఆరోగ్యశ్రీ కార్డు కలిగిన వారు, రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు,జర్నలిస్టులు,అర్హులైన రేషన్ కార్డు కలిగిన వారు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

**జనం సాక్షి సెప్టెంబర్ (07)ఆత్మకూర్ (ఎం)**
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి యత్నించిన బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండల ప్రెసిడెంట్ ఫైళ్ల ప్రశాంత్ మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతులను అణచివేయడం సిగ్గుచేటని, బకాయిలు చెల్లించకుంటే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అరెస్ట్ అయిన వారిలో ప్రధాన కార్యదర్శి లోడి మహేష్, పొనగాని సూర్యప్రకాష్, బండారి సాయి తదితరులు ఉన్నారు.



## ఎన్నికలో ఇచ్చిన 6 గ్యారంటీలు అమలు చేయాలి




**హాలియా జనం సాక్షి సెప్టెంబర్ 7**
కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు అయిన సందర్భంగా. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నేటికీ అమలు చేయలేదని అణువుల మండల టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కూరాకు వెంకటేశ్వర్లు విమర్శించారు. సోమవారం నోముల భగవత్ ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిలో టిఆర్ఎస్ నాయకులతో కలిసి ఎన్నికలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు 420 హామీలు అమలు చేయాలని వినతి పత్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలో హాలియా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వడ్డే సతీష్ రెడ్డి. సుధాకర్ వెంకట్ టిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలు

**సూర్యాపేట (జనంసాక్షి):**



సూర్యాపేట పట్టణ పరిధిలోని శాంతినగర్ లో శ్రీదుర్గా మల్లేశ్వర దేవాలయంలో కనకదుర్గ, బంగారు మైసమ్మ, పరమశివుడు విగ్రహాల ప్రతిష్టాపన, ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా ముగిశాయి.శ్రీలక్ష్మీనరసింహ ట్రస్ట్ ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ చైర్మన్ ఉప్పల గురునాథం అధ్యక్షతన చివరి రోజు సోమవారం ముగింపు రోజు ఉత్సవాలలో భాగంగా హోమాలు, పూర్ణాహుతి, మంత్రస్థాపన,తదియరాధన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ మహోత్సవంలో రాష్ట్ర నాటక అకాడమీ చైర్మన్ పి.అలేఖ్య మంజుల ముఖ్యఅతిథిగా హాజరై ఏర్పాట్లపై ఆలయ కమిటీని అభినందించారు.ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఈగ దయాకర్ గుప్తా, పెద్దిరెడ్డి గణేష్, తోట శ్యాం ప్రసాద్, బెలిదే శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు గజ్జల రవీందర్, తల్లాడ వెంకటేశ్వర్లు, గుండా రమేష్, మంచాల అంబరీష, రంగయ్య, నూనె యుగంధర్, కర్నాటి మధు, వీర్లపాటి వెంకటేశ్వర్లు ఏర్పాట్లు పర్యవేక్షించగా, వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమాలకు హాజరై కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను విస్మరించింది: బిఆర్ఎస్

**గరిడేపల్లి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సూచనలతో గరిడేపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు.మండల అధ్యక్షులు వంటేద్దు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం జాతీయ రహదారిపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను విస్మరించిందని విమర్శించారు. అసెంబ్లీలో నల్ల టీ షర్టులతో నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై పోలీసులతో దాడి చేయించారని ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని మండిపడ్డారు. నాగార్జునసాగర్ ఎడమ కాలువ నీటి విడుదలకు షెడ్యూల్ ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు గుగ్లోత్ కృష్ణ నాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వీరారెడ్డి చంద్రారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గుత్తికొండ ప్రమీల, మాజీ సర్పంచులు కీతా రామారావు, బోధ సిద్దిరెడ్డి, సుధా నాగరాజు, నాయకులు మన్సూర్ అలీ, పెండెం ధనయ్య గౌడ్, ప్రధాని సైదులు తదితరులు పాల్గొన్నారు.



## క్రీడా పోటీల్లో పొనుగోడు విద్యార్థుల ప్రభంజనం

**గరిడేపల్లి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):**



స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పొనుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు.గత మూడు రోజులుగా జరుగుతున్న పోటీల్లో చివరి రోజైన సోమవారం ఫైనల్ పోటీలను పొనుగోడులో ఘనంగా నిర్వహించారు. క్రీడా ఉపాధ్యాయుడు రాంప్రసాద్ చొరవతో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ఆర్థిక సహకారం అందించి క్రీడా వేదికను రూపొందించడం అభినందనీయం అన్నారు.ఈ పోటీలను మండల విద్యాధికారి పానుగోతు చత్రు నాయక్, గడ్డిపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు డి. నాగమణి, పొనుగోడు సర్పంచ్ కటకం వేణు ప్రారంభించారు.అండర్-14, అండర్-17 బాలుర వాలీబాల్ విభాగంలో పొనుగోడు విద్యార్థులు రెండు ప్రథమ బహుమతులు, బాలికల విభాగంలో రెండు ద్వితీయ బహుమతులు సాధించారు. అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో ప్రథమ బహుమతి, బాలికల విభాగంలో ద్వితీయ బహుమతి గెలుచుకున్నారు.పాఠశాల ఆవరణలో క్రీడలు నిర్వహించడానికి సహకరించి షీల్డులు అందించిన ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.హెచ్. వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు మేకల సందీప్, బస్వ కోటేశ్వరరావు, పోకల సుధాకర్, పురుషోత్తం, వై. కృష్ణారెడ్డిలకు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నర్స కుమారి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలతో పాటు దేశభక్తిని, క్రమశిక్షణను పెంపొందిస్తున్న క్రీడా ఉపాధ్యాయుడు రాంప్రసాద్ ను ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



## బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం

**సూర్యాపేట (జనంసాక్షి):**
అసెంబ్లీలో సోమవారం జరిగిన ఘటనను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను ఆ సంఘ నాయకులు దహనం చేశారు.ఈ సందర్భంగా భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం నాయకులు బంటు సందీప్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు నల్ల టీ షర్టులతో అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడం సరికాదన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళ్తున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలను అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారు.నిరసన తెలిపే హక్కు కూడా ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు లేకుండా చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని అన్నారు.ఈ కార్యక్రమంలో చామకూరి మహేందర్, ఎలగబోయిన వంశీ, కేశగాని సతీష్, వర్రే నవీన్, ఖమ్మంపాటి ఉదయ్, పోలేబోయిన నరసింహా, కోడి రవి, పడిదల నవనీత్, మీసాల వెంకట్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడి.. నేరేడుచర్లలో నిరసన

నేరేడుచర్ల సెప్టెంబర్ 07 (జనంసాక్షి): అసెంబ్లీలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలపై జరిగిన దాడికి నిరసనగా హుజూర్ నగర్ నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ సమన్వయకర్త ఒంటెద్దు నర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నేరేడుచర్ల పట్టణంలో నిరసన ధర్నా కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధాన రహదారిపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఒంటెద్దు నరసింహారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నిరంకుశ పాలన నడుస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే సమాధానం చెప్తారన్నారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ మాజీ అధ్యక్షులు అరిబండి సురేష్ బాబు,డిసిసిబి మాజీ డైరెక్టర్,3 వ వార్డు కౌన్సిలర్ దొండపాటి



అప్పిరెడ్డి,నాయకులు చెన్నబోయిన సైదులు, అన్నపురెడ్డి నారాయణ రెడ్డి, చందమల్ల జయబాబు, యల్లబోయిన లింగయ్య యాదవ్,నాగండ్ల శ్రీధర్, ఇంజమూరి రాములు,చిత్తలూరి సైదులు,వస్కుల సుదర్శన్, హుస్సేన్,గుర్రం మార్కండేయ, పాల్వాయి కృష్ణ మూర్తి,సాయి, రామస్వామి,రామ్ రెడ్డి, గంట చిన మల్లారెడ్డి,అంబటి నాగయ్య,పల్లెపంగు నాగరాజు,నందిపాటి గురవయ్య ,సైదిరెడ్డి, పార్ధనబోయిన నాగరాజు, లకుమల్ల రవీందర్,లంకేపల్లి నాగార్జున,శ్రీనివాస్,బాలు నాయక్,అనంతు రాంబాబు, పట్టేపురం వెంకటేశ్వర్లు, పోలగాని భరత్ గౌడ్,సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి క్రికెట్ లీగ్‌కు కోదాడ క్రీడాకారిణి



**కోదాడ( జనంసాక్షి):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఉమెన్స్ అండర్-19 క్రికెట్ లీగ్ పోటీలకు కోదాడ క్రికెట్ అకాడమికి చెందిన క్రీడాకారిణి నాగార్జునపు సింధుజ ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి లీగ్ మ్యాచ్‌లు సెప్టెంబర్ 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్నారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన క్రీడాకారిణి రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టుకు నాయకత్వం వహించే స్థాయికి ఎదగడం పట్ల కోదాడ క్రికెట్ అకాడమీ సభ్యులు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేశారు.అనంతరం క్రికెట్ అకాడమీ కోచ్ షేక్ సిద్ధిఖ్ మాట్లాడుతూ, నల్గొండ జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని ఎంతోమంది ప్రతిభావంతులైన క్రీడాకారులు వెలుగులోకి వస్తున్నారని తెలిపారు. జిల్లా క్రికెట్ అసోసియేషన్ అందిస్తున్న ప్రోత్సాహం, సహకారం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో క్రికెట్ మరింత విస్తరిస్తోందని, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో మంచి అవకాశాలు లభిస్తున్నాయని పేర్కొన్నారు.

# ఆరోగ్య సమస్యలతో మనస్తాపం



**పురుగుల మందు తాగి మాజీ వైస్ ఎంపీపీ ఆత్మహత్య**

**పెద్దవూర సెప్టెంబర్ 7 (జనంసాక్షి )**
ఆరోగ్య సమస్యలు తాళలేక మనస్తాపానికి గురై మండల పరిధిలోని బసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ వైస్ ఎంపీపీ గోన వివేక్‌రావు (59) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు.స్థానికులు మరియు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వివేక్‌రావు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన భార్య సుకన్య, కుమార్తె ఐశ్వర్య గత పదేళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటుండగా, వివేక్‌రావు బసిరెడ్డిపల్లిలోని స్వగృహంలో తల్లి యాదమ్మతో కలిసి ఉంటున్నారు.సోమవారం తెల్లవారుజామున సుమారు 3:09 గంటల సమయంలో ఆయన ఇంట్లో పురుగుల మందు తాగారు. గమనించిన స్థానికులు అక్కడికి చేరుకునేలోపే ఆయన ఇంటి మిద్దెపై నుంచి కిందకు దూకేశారు. తీవ్రంగా గాయపడిన వివేక్‌రావును వెంటనే నాగార్జునసాగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అయితే, ఉదయం 6 గంటల ప్రాంతంలో పరీక్షించిన వైద్యులు ఆయన అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.గత కొంతకాలంగా వివేక్‌రావు తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని, ఆ మనస్తాపంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఆయన తల్లి గోన యాదమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పెద్దవూర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



# విద్యుత్ శాఖ ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన పి.యాదగిరి

**సూర్యాపేట (జనంసాక్షి):**
సూర్యాపేట విద్యుత్ శాఖ ఎస్ఈగా పి.యా దగిరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సంద ర్భంగా తెలంగాణ విద్యుత్ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఘనంగా సన్మా నించి శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ముత్యం వెంకన్న గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బ్రహ్మానందరావు, కంపెనీ సెక్రటరీ బొబ్బిలి మురళీ, జిల్లా గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గుండు పరుశరాములు, జిల్లా కార్యదర్శి బెల్లంకొండ భరత్, డివిజన్ అధ్యక్షులు ఉపేందర్, కార్యదర్శి కృష్ణారావు, నాయకులు స్వాతి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు ఘనంగా సన్మానం



**కొండమల్లేపల్లి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):**
వృత్తిలో అంకితభావంతో విధులు నిర్వహిస్తే వారికి తప్పకుండా సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని కొండమల్లేపల్లి, పీఏ పల్లి ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షులు ఊరే జనార్ధన్, విడియాల రామయ్య తెలిపారు. సోమవారం కొండమల్లేపల్లి, పీఏ పల్లి, గుడిపల్లి మండలాలకు చెందిన ఆర్యవైశ్య సంఘం సభ్యులు వనవాసం వెళ్లారు. ఈ సందర్భంగా మహిళలు యువతులు చిన్నారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటలు ఆడుతూ పాటలు పాడుతూ సందడి చేశారు. అనంతరం రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న కొండమల్లేపల్లికి చెందిన శ్రీ క్రాంతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దుండిగల్ అశోకు ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొండమల్లేపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరే జనార్ధన్, ప్రధాన కార్యదర్శి దాచేపల్లి వెంకటేశ్వర్లు, కోశాధికారి కొత్త వెంకటేశ్వర్లు, ఉమ్మడి పీఏ పల్లి మండల అధ్యక్షుడు విడియాల రామయ్య, సముద్రాల ధనయ, దాచేపల్లి నరేందర్, సముద్రాల శ్రీను గుడిపల్లి ఎంఈఓ సముద్రాల శ్రీనివాస్, రాచమల్ల నరసింహ, తోట నరసింహ, జిన్నం రామ్మూర్తి, మిరియాల శ్రీనివాస్ కామిశెట్టి శ్రీనివాస్, ముచ్చర్ల కరుణాకర్, మారం వెంకన్న, తేటిపల్లి బుచ్చి రాములు, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు సముద్రాల స్వప్న, వాస నీరజ, దొడ్డి రమాదేవి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలి

## మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**రామన్నపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, అన్ని వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు సోమవారం రామన్నపేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో వైఫల్యాలను నిరసిస్తూ భారీ ర్యాలీ నిర్వహించి గ్రీవెన్స్ డే సందర్భంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 420 హామీలు,13 డిక్లరేషన్లు, 6 ఆరు గ్యారెంటీ ల పేరుతో నమ్మించి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామని చెప్పి ఇప్పటికి 1000 రోజులైనా ఒక్క హామీను కూడా పూర్తిస్థాయిలో నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. ప్రజా సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుం దని, ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి మాటను నిలబెట్టుకోవాలని,



లేకుంటే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నీల దయాకర్ మాజీ మండల అధ్యక్షులు బందెల రాములు, పోషబోయిన మల్లేశం మాజీ రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు బొక్క మాధవరెడ్డి సర్పంచులు కంభంపాటి శ్రీనివాస్, గర్దాస్ విక్రమ్, పులిపలుపుల వీరస్వామి, గొలుసుల సత్తయ్య మాజీ ఎంపీటీసీలు సర్పంచులు వేమవరం సుధీర్ బాబు, దోమల సతీష్, గాదె పారిజాత, ఎండి అమీర్, కోళ్ల స్వామి జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం, ఎస్ కె చాంద్, మందడి సాగర్ రెడ్డి పట్టణ కార్యదర్శి జాడ సంతోష్ నాయకులు మెట్టు శ్రీనివాస్ రెడ్డి, బత్తుల వెంకన్న, కాటేపల్లి యాదయ్య, కోళ్ల కిషన్, మంటిపల్లి లింగస్వామి, జంగిలి నరసింహ, నల్ల స్వామి, తాళ్ల క్రాంతి కుమార్, చొప్పరి నరసింహ, బండ శ్రీనివాస్ రెడ్డి, మామిళ్ళ అశోక్, గంగుల రాఘవరెడ్డి, గుండాల రాంబాబు, నక్క నరేందర్, పులిగిల్ల పరమేష్, ఎండి అజాజ్, ఆవుల శ్రీధర్, జాల అమరేందర్ రెడ్డి, నల్ల సైదులు, రాస వెంకటే శ్వర్లు, కృష్ణ, గర్దాస్ కరుణాకర్, బత్తిని మహేష్, కూనూరు లింగస్వామి, గాదె శంకర్, మామిళ్ళ కుమార్, బాసాని రాజు, బీరం రాజి రెడ్డి, మందడి నర్సిరెడ్డి, చలమల్ల బిక్షం రెడ్డి, గట్టు శేఖర్, వంగాల సాయి తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోండి

## ప్రజావాణిలో చిన్నారుల వినతి

**భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):**
పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ చిన్నారులు సోమవారం భూదాన్ పోచంపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎంపీడీఓ విజయ కు వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయురాలి నిర్లక్ష్యంపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలి : ఏ. శ్రీ దేవసేన ఐఏఎస్

**○అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా..**

**○అనర్హుల పేర్లు జాబితాలోకి రాకుండా చూడాలి..**

**○ఎస్ఐఆర్ ప్రక్రియను నిబంధనల మేరకు సమర్థ వంతంగా, వేగవంతంగా పూర్తి చేయాలి**





**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్07 (జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ మరియు ఎస్ఐఆర్ రోల్ అబ్జర్వర్ ఏ. శ్రీ దేవసేన ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లాకు విచ్చేసిన ఏ. శ్రీ దేవసేన ఐఏఎస్‌కు జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు.

సోమవారం ఐడీఓసీలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లకు నోటీసుల జారీ, నోటీసుల పంపిణీ, విచారణల నిర్వహణ, పెండింగ్‌లో ఉన్న కేసులు, అవసరమైన ధ్రువపత్రాల పరిశీలన, క్షేత్రస్థాయిలో బూత్ స్థాయి అధికారులు చేపడుతున్న కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్షించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు, అనర్హులైన వారి పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనల మేరకు సమగ్ర పరిశీలన నిర్వహించాలని ఏ. శ్రీ దేవసేన సూచించారు. ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అని, అర్హత కలిగిన ప్రతి వ్యక్తికి ఆ హక్కు లభించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 8,63,413 మంది సాధారణ ఓటర్లు ఉన్నట్లు అధికారులు వివరించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఓటర్ల వివరాలను పరిశీలించిన సందర్భంగా సంబంధిత రికార్డులతో సరిపోలని వివరాలు ఉన్న, అదనపు పరిశీలన అవసరమైన ఓటర్లకు నోటీసులు జారీ చేసి, వారి అభ్యంతరాలు, ఆధారాల స్వీకరణ, విచారణ ప్రక్రియను నిబంధనల మేరకు కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో మొత్తం 2,40,438 నోటీసులు జారీ చేయాల్సి ఉండగా, సెప్టెంబర్ 7న మధ్యాహ్నం 12 గంటల వరకు 2,40,435 నోటీసులు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. సిద్ధం చేసిన నోటీసుల్లో 1,42,392 నోటీసులను సంబంధిత ఓటర్లకు అందజేయగా, ఇంకా 98,043 నోటీసులు అందజేయాల్సి ఉన్నట్లు వెల్లడించారు. మిగిలిన నోటీసులను సంబంధిత ఓటర్లకు త్వరితగతిన అందజేసి, ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని రోల్ అబ్జర్వర్ ఆదేశించారు. నియోజకవర్గాల వారీగా నోటీసుల పంపిణీ పురోగతిని అధికారులు వివరించారు. ఎల్లందు నియోజకవర్గంలో 43,317 నోటీసులకు గాను 31,653 నోటీసులు, అంటే 73.07 శాతం పంపిణీ చేసి జిల్లాలో అత్యధిక పంపిణీ శాతం నమోదైంది. అశ్వారావుపేటలో 36,354 నోటీసులకు గాను 25,051 (68.91 శాతం), కొత్తగూడెంలో 70,174కు గాను 40,163 (57.23 శాతం), భద్రాచలంలో 34,502కు గాను 18,901 (54.78 శాతం), పినపాకలో 56,091కు గాను 26,624 (47.47 శాతం) నోటీసులు పంపిణీ చేసినట్లు తెలిపారు. నోటీసు అందజేసిన అనంతరం సంబంధిత బూత్ స్థాయి అధికారి (బీఎల్ఓ) తప్పనిసరిగా అందజేసినట్లు రసీదును యాప్‌లో నమోదు చేయాలని ఏ. శ్రీ దేవసేన స్పష్టం చేశారు. రసీదు వివరాలు యాప్‌లో నమోదు చేసిన తర్వాతనే సంబంధిత నోటీసు అందజేత పూర్తయినట్లుగా పరిగణించాలని పేర్కొన్నారు. మిగిలిన నోటీసుల పంపిణీపై క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ నిర్వహించి, ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

విచారణల ప్రక్రియలో ఇప్పటివరకు జిల్లాలో 8,275 విచారణలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. కాగా 86,182 విచారణ తేదీలు గడిచిపోయినట్లు, తిరిగి నిర్ణయించిన తేదీలలో 643 తేదీలు కూడా గడిచిపోయినట్లు వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా భద్రాచలంలో 3,999, కొత్తగూడెంలో 2,845, ఎల్లందులో 828, పినపాకలో 434, అశ్వారావుపేటలో 169 విచారణలు నిర్వహించినట్లు వివరించారు.

విచారణకు పిలిచిన వారిలో దాదాపు 60 శాతం మంది హాజరవుతుండగా, హాజరవుతున్న వారిలో 30 నుంచి 40 శాతం మంది సరైన ధ్రువపత్రాలు లేకుండా వస్తున్నట్లు సమావేశంలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో విచారణ తేదీకి ముందుగానే సంబంధిత ఓటర్లకు సమర్పించాల్సిన ధ్రువపత్రాల వివరాలను స్పష్టంగా తెలియజేయాలని ఏ. శ్రీ దేవసేన సూచించారు. ఓటర్లు అవసరమైన పత్రాలతో విచారణకు హాజరయ్యేలా బీఎల్ఓలు, బీఎల్ఏల ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. బీఎల్ఓలు, బీఎల్ఏలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై కేవలం సాధారణ అవగాహన కల్పించడం కాకుండా, వివిధ రకాల కేసుల్లో ఏయే ధ్రువపత్రాలు సమర్పించాలి, వాటిని ఎలా పరిశీలించాలి, ఏ విధమైన చర్యలు చేపట్టాలి అనే అంశాలపై క్షేత్రస్థాయి శిక్షణ అందించాలని సూచించారు. ప్రతి ఇంటినీ సందర్శించి, సంబంధిత ఓటర్లకు అవసరమైన ధ్రువపత్రాలపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన సహకారం అందించేలా బీఎల్ఓల పనితీరును అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. పుట్టిన తేదీ, వయస్సు తదితర వివరాల నిర్ధారణకు ఎన్నికల సంఘం నిర్దేశించిన ధ్రువపత్రాలను ఓటర్లు సమర్పించాలని అధికారులు తెలిపారు. ఓటరు పేరు లేదా ఇతర వివరాల్లో వ్యత్యాసాలు ఉన్న సందర్భాల్లో తగిన ఆధారాలు అందుబాటులో లేనట్లయితే, నిబంధనల మేరకు క్షేత్రస్థాయి పరిశీలన, పంచనామా తదితర అవసరమైన ప్రక్రియలను చేపట్టాలని సూచించారు. ఇతర ధ్రువపత్రాలు అందుబాటులో లేని సందర్భాల్లో పాస్‌పోర్టు వంటి పత్రాలను నిబంధనల పరిధిలో ఆధారంగా పరిగణించే అంశాన్ని పరిశీలించాలని తెలిపారు.

ప్రస్తుతం జిల్లా ఎన్నికల అధికారి పరిశీలనకు 1,725 కేసులు పెండింగ్‌లో ఉండగా, వాటిలో 309 కేసులు ఐదు రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఐదు రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న కేసులను ప్రాధాన్యతా క్రమంలో పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని ఏ. శ్రీ దేవసేన ఆదేశించారు. గడువు ముగిసిన విచారణలకు సంబంధించిన కేసులను ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు వెంటనే పరిశీలించి, నిబంధనల ప్రకారం తదుపరి నిర్ణయం తీసుకోవాలని సూచించారు.

తుది ఓటర్ల జాబితా ప్రచురణకు సంబంధించి 16,307 కేసులను తదుపరి పరిశీలన కోసం తాత్కాలికంగా నిలిపి ఉంచినట్లు అధికారులు తెలిపారు. వీటిలో నోటీసులకు సంబంధించిన 6,336 కేసులు, ఇతర కారణాలకు సంబంధించిన 9,971 కేసులు ఉన్నట్లు వివరించారు.

అర్హులైన ఓటర్లకు ఓటు హక్కు నిరాకరించబడకుండా చూడటంతో పాటు, అర్హత లేని వ్యక్తుల పేర్లు ఓటర్ల జాబితాలో కొనసాగకుండా నిబంధనల మేరకు చర్యలు చేపట్టడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రధాన ఉద్దేశమని ఏ. శ్రీ దేవసేన తెలిపారు. ఓటర్ల పేర్ల తొలగింపుకు సంబంధించిన ప్రతి కేసును నిబంధనల మేరకు సమగ్రంగా పరిశీలించి, కారణాలను స్పష్టంగా నమోదు చేస్తూ నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల నమోదు అధికారులను ఆదేశించారు.

ఎస్ఐఆర్ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పరిధిలోని ఓటర్లకు అవగాహన కల్పించాలని ఏ. శ్రీ దేవసేన సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు తుది ఓటర్ల జాబితాలో నమోదు అయ్యేలా సంబంధిత అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎదురయ్యే సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువస్తే, నిబంధనల పరిధిలో వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే అర్హత కలిగిన, ఏ అసెంబ్లీ నియోజకవర్గంలోనూ ఓటరుగా నమోదు కాని వ్యక్తులు ఫారం-6 ద్వారా కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఇందుకు అవసరమైన వయస్సు ధ్రువీకరణ పత్రం, తాజా ఫొటో, ప్రకటన తదితర వివరాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ అనంతరం తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 19, 2026న ప్రచురించనున్నట్లు వెల్లడించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలు మరియు రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఓటర్లకు ఎటువంటి సందేహాలు లేదా సమస్యలు ఉన్నా సంబంధిత బూత్ స్థాయి అధికారి, సహాయ ఎన్నికల నమోదు అధికారి, ఎన్నికల నమోదు అధికారులను సంప్రదించవచ్చని, అలాగే 1950 టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా అవసరమైన సమాచారాన్ని పొందవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఐటిడిఏ పిఓ రాహుల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట్రావు, తాసిల్దార్లు, సిపిఐ పార్టీ వెంకటేశ్వర్లు, బిజెపి డాక్టర్ వెంకన్న నాయక్, ఆమ్ ఆద్మీ పార్టీ రాంబాబు, కాంగ్రెస్ పార్టీ లక్ష్మణ్ అగర్వాల్, కార్తిక్,బి ఎస్ రెడ్డి, టిఆర్ఎస్ అనుదీప్ వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలు, 420 హామీలు తక్షణమే అమలు చేయాలని నిరసన

### చౌటుప్పల్ లో ఆర్డీవోకు బిఆర్ఎస్ శ్రేణులు వినతి



**చౌటుప్పల్ సెప్టెంబర్ 7(జనంసాక్షి)** కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను తక్షణమే అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎమ్మెల్యే కూసుకుంట ప్రభాకర్ రెడ్డి పిలుపు మేరకు సోమవారం చౌటుప్పల్ ఆర్డిఓ కు బిఆర్ఎస్ శ్రేణులు వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన 420 హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు, మల్కాపురం సర్పంచ్ గిర్కటి నిరంజన్ గౌడ్,చౌటుప్పల్ మున్సిపల్ కన్వీనర్ బొమ్మిరెడ్డి వెంకటరెడ్డి,సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి భార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాండూరి పరమేష్,మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, కౌన్సిలర్లు గద్దం ఇందిరా రాజారత్నం,ఉదరి యాదయ్య,మాజీ గ్రంథాలయం అధ్యక్షుడు ఉడుగు మల్లేష్ గౌడ్,మండలం మున్సిపాలిటి నాయకులు డిల్లీ మాధవరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సూర్వి మల్లేష్ గౌడ్, నాయకుడు అత్తార్ పాషా,చెవగొని మహేష్ గౌడ్, ఎండి.మున్నా,మెట్టు మహేశ్వర్ రెడ్డి,బొమ్మగోని మల్లేష్ గౌడ్, ఎండి.ముషీర్,సంగిశెట్టి శివ,రఘు, ఎండి. అబ్బాస్,ఇమ్మడి ఈశ్వర్ గుప్తా, ఎండి.అత్తు,తదితరులు పాల్గొన్నారు.

## ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని వినతి



**చౌటుప్పల్ సెప్టెంబర్ 7(జనం సాక్షి)** పట్టణ కేంద్రంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కోరుతూ బిఆర్ఎస్ మున్సిపల్ ప్రజాప్రతినిధులు ఆర్‌డిఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొయ్యడ శేఖర్ గౌడ్, కౌన్సిలర్లు మాట్లాడుతూ... 65వ నంబర్ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ పనులు అత్యంత మందకొడిగా సాగుతుండటంతో నిత్యం రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణ పనుల కారణంగా వాహనాలను ఇరువైపులా ఉన్న సర్వీస్ రోడ్ల మీదుగా మళ్లిస్తుండటంతో సర్వీస్ రోడ్లు రద్దీగా మారి నిత్యం భారీగా ట్రాఫిక్ జామ్ అవుతోందన్నారు. వారాంతాలు, సెలవు దినాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు గంటల తరబడి నరకయాతన అనుభవిస్తున్నారని, అత్యవసర సేవలందించే అంబులెన్సులు కూడా ట్రాఫిక్‌లో చిక్కుకుపోతున్నాయని తెలిపారు. స్థానిక ప్రజలు, పాదచారులు రహదారి దాటడానికి సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు, వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని, నిర్మాణ ప్రాంతాల్లో వెంటనే తాత్కాలిక ప్రత్యామ్నాయ మార్గాలను ఏర్పాటు చేయాలని, అలాగే ట్రాఫిక్ నియంత్రణకు తగిన సిబ్బందిని నియమించేలా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఓను కోరారు.

# ఖమ్మంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ నిరసన రాస్తారోకో

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి)** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ పార్టీ శాసనసభ్యులను అసెంబ్లీలోకి రానివ్వకుండా పోలీసులు అడ్డుకోవడం, వారిపై దురుసుగా వ్యవహరించడం, మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, పలువురు ఎమ్మెల్యేలను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఖమ్మం నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం, రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మాజీ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు,ఖమర్ కర్ణాటి కృష్ణ, బచ్చు విజయ్,బీరెడ్డి,నాగచంద్రారెడ్డితదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 420 హామీలు, ఆరు గ్యారంటీల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఆరోపించారు.
కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ఎండగడుతూ గత వారం రోజులుగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ అసెంబ్లీ వేదికగా ప్రస్తావించి ప్రభుత్వాన్ని నిలదీస్తారనే భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అసెంబ్లీలోకి అడుగుపెట్టకుండా అడ్డుకున్నారని విమర్శించారు.
ప్రతిపక్ష శాసనసభ్యులు ప్రజల తరఫున ప్రశ్నలు అడిగితే సమాధానం చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కానీ ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పరిస్థితిలో ప్రభుత్వం ప్రతిపక్ష గొంతును అణచివేసే ప్రయత్నం చేస్తోందని,ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే సమాధానం చెప్పకుండా వ్యక్తిగత విమర్శలు, దూషణలకు దిగడం ముఖ్యమంత్రి స్థాయికి తగదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు మాట్లాడే హక్కు, ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించే హక్కు ఉంటుందని, ఆ హక్కులను కాలరాయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ శాసనసభ్యులపై పోలీసులు వ్యవహరించిన తీరును, ముఖ్యంగా మహిళా శాసనసభ్యుల పట్ల అనుచితంగా ప్రవర్తించిన తీరును తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అక్రమ అరెస్టులను వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రజా సమస్యలపై ప్రతిపక్షం ప్రశ్నించే హక్కును ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. ప్రజల కోసం ప్రశ్నించే గొంతులను అణచివేస్తే బీఆర్ఎస్ పార్టీ చూస్తూ ఊరుకోదని, ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ బత్తుల మురళి ప్రసాద్ మాజీ కార్పొరేటర్లు షేక్ మక్బుల్, నాగండ్ల కోటి,కూరాకుల వల్లరాజు, పల్లా రోస్ లీనా,జ్యోతి రెడ్డి,కనకం భద్రయ్య, దేవ భక్తిని కిషోర్, పగడాల నరేందర్, బోజెడ్ల రాంమోహన్,షేక్ షకీన, మాటేటి కిరణ్, మారంపుల వీరభద్రం, మహ్మద్ రఫీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## మూగజీవాలపై క్రూరత్వాన్ని అరికట్టాలి

### - భద్రాచలం డీఎస్పీకి బీజేపీ నేతల వినతి

**భద్రాచలం సెప్టెంబరు 07 (జనంసాక్షి)**
భద్రాచలం పరిసర ప్రాంతాల్లో ఎద్దులు, ఆవులతో ఇసుక బండ్లు లాగిస్తూ అధిక బరువులు మోయించడం, విశ్రాంతి లేకుండా తిప్పడం, అలసిపోయిన పశువులను కొట్టడం వంటి చర్యలను అరికట్టాలని బీజేపీ భద్రాచలం నాయకులు కోరారు. ఈ మేరకు భద్రాచలం డీఎస్పీ, ఎస్‌డీపీఓ ఎం. అరుణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గోదావరి ఇసుక ర్యాంపుల నుంచి పట్టణం వైపు ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక తరలించే క్రమంలో మూగజీవాలపై జరుగుతున్న క్రూరత్వంపై తక్షణ విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. పశువులతో పని చేయించడం సంప్రదాయంలో భాగమైనప్పటికీ, అధిక బరువులు మోయించడం, విశ్రాంతి లేకుండా నడిపించడం, కొట్టడం క్రూరత్వమేనని పేర్కొన్నారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామివారి పవిత్ర క్షేత్రమని, గోమాతను గౌరవించే సంస్కృతిలో మూగజీవాలపై క్రూరత్వానికి తావులేకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సంతోష్, నాయకులు కుంజా ధర్మా, నిడదవోలు నాగబాబు, ముత్యాల చంద్రశేఖర్, గంగులకుర్తి రామాచారి తదితరులు పాల్గొన్నారు.



## భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయానికి ముందడుగు

రైల్వే మార్గం విమానాల అప్రోచ్ ఫన్నెల్ పరిధిలోకి వచ్చే అవకాశాల నేపథ్యంలో దాని వల్ల ఏర్పడే సాంకేతిక ప్రభావాలను పరిశీలిస్తున్నారు. అవసరమైతే 'షీల్డింగ్' ప్రక్రియ ద్వారా సాంకేతిక అవరోధాన్ని అధిగమించే అవకాశాలను కూడా పరిశీలించడంతో పాటు, రైల్వే శాఖ నుంచి అవసరమైన ఎన్‌ఓసీ పొందే అంశంపై చర్యలు చేపట్టనున్నారు.
పరిశీలనలో భాగంగా సంబంధిత అధికారులు సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణం, రెవెన్యూ మ్యాపులు, భౌగోళిక కోఆర్డినేట్లు, స్థల హద్దులు, అప్రోచ్ రోడ్లు, రెవెన్యూ మరియు సాంకేతిక రికార్డులను సిద్ధంగా ఉంచి ఏఏఐ బృందానికి అందుబాటులో ఉంచారు. క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉన్న వివరాలను పరిశీలిస్తూ, రికార్డులతో సరిపోల్చి బృందం సాంకేతిక అధ్యయనం నిర్వహిస్తోంది.
ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని తెలిపారు. పారిశ్రామిక, వాణిజ్య, పర్యాటక రంగాల అభివృద్ధితో పాటు ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.
జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ జిల్లాలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఏర్పాటుకు సంబంధించి ఏఏఐ సాంకేతిక బృందం నిర్వహిస్తున్న పరిశీలనకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందన్నారు. అవసరమైన రెవెన్యూ, సర్వే, సాంకేతిక సమాచారాన్ని సిద్ధంగా ఉంచి, బృందం క్షేత్రస్థాయి పరిశీలన సజావుగా జరిగేలా సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేస్తున్నట్లు తెలిపారు.
రెండు రోజుల పర్యటనలో భాగంగా సోమవారం మొదటి రోజు ప్రతిపాదిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించగా, రెండో రోజు కూడా షెడ్యూల్ ప్రకారం మిగిలిన ప్రాంతాలు, సాంకేతిక అంశాలను బృందం పరిశీలించనుంది. మొత్తం పరిశీలన అనంతరం టెక్నికల్ ఫీజిబిలిటీ స్టడీ నిర్వహించి, విమానాశ్రయ ఏర్పాటుకు సంబంధించిన సాంకేతిక సాధ్యాసాధ్యాలపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నారు.
ఈ పర్యటనలో సంబంధిత రెవెన్యూ, సర్వే, ఇంజినీరింగ్, ఇతర శాఖల అధికారులు, ఏఏఐ సాంకేతిక ప్రతినిధులు పాల్గొన్నారు.



## కల్వకుంట్ల చంద్ర సేన గుప్తా సేవలు చిరస్మరణీయము

### ఉపాధ్యాయులకు మరియు జర్నలిస్టులకు సన్మానం

**హాలియా జనం సాక్షి సెప్టెంబర్ 7**
వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు కల్వకుంట చంద్ర సేన 120 జయంతి వేడుకలు హాలియాలో వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు ఈ సందర్భంగా జర్నలిస్టులు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు పాంపాటి నిర్మలాదేవి, కార్యదర్శి నీలా ఉషారాణి , కోశాధికారి నీల పద్మ , ఆర్ఎస్ కుక్కడపు ఝాన్సీ లక్ష్మి,చార్టెడ్ ప్రెసిడెంట్ గార్లపాటి శోభ,, మారం అనిత ,పద్మ, అనిత, సుకన్య, సత్యవతి మరియు హాలియ గ్రేటర్ వాసవి క్లబ్ అధ్యక్షుడు కేస శేఖర్, కార్యదర్శి అంకి శెట్టి రమేష్, కోశాధికారి చిట్టిపోలు సురేందర్, ఐపిసి కొండూరు శోభన్ బాబు, డిస్టిక్ ఇంచార్జ్ బచ్చు సతీష్, రీజియన్ చైర్మన్ గందే మహేష్, జోన్ చైర్మన్ గట్టు వెంకటేశ్వర్లు, పాంపాటి వెంకటేశం, దామోదర్, రాజు, అరవిందు, మరియు వాసవి క్లబ్ సభ్యులు, వనితా క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు నాయకులు పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

## డిజిటల్ పంట సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**జనం సాక్షి సెప్టెంబర్ (07)ఆత్మకూర్ (ఎం)**
మండలంలోని 17 రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ పంట సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. అశోక్ కుమార్ కోరారు. సన్న రకాల వరి సాగు చేసే రైతులు వివరాలు నమోదు చేయిస్తేనే క్వింటాలుకు రూ. 500 బోనస్ వర్తిస్తుందని తెలిపారు. సెప్టెంబర్ 30, 2026 చివరి తేదీలోపు ప్రతి రైతు తమ పొలాల వివరాలను నమోదు చేయించుకోవాలని, సందేహాల కోసం రైతువేదికను సంప్రదించాలని సూచించారు.



## పోలీసుల దురుసు ప్రవర్తనను ఖండించిన మాజీ ఎంపీ నామ

**ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 7 ( జనం సాక్షి )**

అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల అత్యుత్సాహం అప్రజాస్వామికం, నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను బలవంతంగా అరెస్ట్ చేయడం దారుణం,అరెస్టు సందర్భంగా కేటీఆర్‌పై పోలీసుల దురుసు ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నా.పోలీసుల తీరు వల్ల కేటీఆర్, జగదీశ్‌రెడ్డి, సునీత లక్ష్మారెడ్డికి స్వల్ప గాయాలు కావడం బాధాకరం,అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు చేసిన తోపులాట వల్ల మాజీ మంత్రి హరీశ్‌రావు కిందపడేలా చేయడం శోచనీయం,మహిళా సాధికారత గురించి మాట్లాడే కాంగ్రెస్.. మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీత లక్ష్మారెడ్డి, కోవా లక్ష్మి పట్ల చూపుతున్న గౌరవం ఇదేనా?,మహిళలకు గౌరవం ఇస్తామని చెప్పే కాంగ్రెస్.. మహిళా ఎమ్మెల్యేలనే ఈ విధంగా లాక్కెళ్లడం సిగ్గుచేటు,ప్రతిపక్ష నేతలపై పోలీసులు బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్యానికి విరుద్ధం, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తారన్న భయంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అరెస్టులు, దౌర్జన్యం బాధ కరం,కేంద్రంలో ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ నిరసనలు చేస్తే ప్రజాస్వామ్యం.. తెలంగాణలో ప్రతిపక్ష బీఆర్ఎస్ నిరసన చేస్తే అరెస్టులా ,రాహుల్ గాంధీ పార్లమెంట్‌కు నల్ల చొక్కాలు ధరించి వెళ్తే తప్పులేదు కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల దుస్తులు ధరిస్తే ఎందుకు అడ్డుకుంటున్నారు.కాంగ్రెస్ పార్టీకి కేంద్రంలో ఒక న్యాయం.. తెలంగాణలో మరో న్యాయమా? ఇదేనా కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి కాదా,ప్రతిపక్షం నిరసన తెలిపే హక్కును కాలరాయడం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనంబీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల గొంతు నొక్కాలని చూస్తే ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారు అంటూ మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

# స్థానిక కాంట్రాక్టర్ల ఉపాధిని దెబ్బతీసే ఇ-ఆక్షన్ విధానాన్ని ఉపసంహరించుకోవాలి

## జెన్‌కో సీఎండీకి కేటీపీఎస్ పొల్యూషన్ ప్రభావిత ప్రాంతాల కాంట్రాక్టర్ల వినతి



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):** తెలంగాణ జెన్‌కో (టీజీ జెన్‌కో) యాజమాన్యం ఇటీవల ప్రవేశపెట్టిన నూతన ఇ-ఆక్షన్ విధానం (ఈ-ఆక్షన్-1 ఆల్ టీపీపీఎస్ యాష్/2026-27) వల్ల స్థానిక కాంట్రాక్టర్లు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని కేటీపీఎస్ (వీ, వీఎ, వీఎఎ స్టేజీలు) పొల్యూషన్ ప్రభావిత గ్రామాల కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. నూతన ఇ-ఆక్షన్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ సోమవారం జెన్‌కో ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ గత పదేళ్లుగా కేటీపీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పొల్యూషన్ ప్రభావిత గ్రామాలకు చెందిన కాంట్రాక్టర్లు యాజమాన్యం నిర్వహించే టెండర్లలో పాల్గొంటూ బూడిద (యాష్) రవాణా పనులు చేపట్టి ఉపాధి పొందుతున్నారని తెలిపారు. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో టీజీ జెన్‌కో పరిధిలోని అన్ని థర్మల్ పవర్ స్టేషన్లకు కలిపి ఒకే కార్పొరేషన్ స్థాయి ఇ-ఆక్షన్ విధానాన్ని ప్రవేశపెట్టడం వల్ల స్థానిక ఆదివాసీ, గిరిజన కాంట్రాక్టర్లు ఉపాధి అవకాశాలను కోల్పోయే ప్రమాదం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులకు కేటాయింపులు పెంచాలికార్పొరేషన్ స్థాయి ఇ-ఆక్షన్ నిబంధనలను తొలగించి, కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) విధానంలో భాగంగా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కాంట్రాక్టర్లు కోరారు. నామినల్ రేట్లకు అనుగుణంగా బూడిద రవాణా పనుల్లో స్థానిక కాంట్రాక్టర్లకు కింది విధంగా కేటాయింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. పాండ్ యాష్ ? 50 శాతంబాటమ్ యాష్ ? 100 శాతంఫ్లై యాష్ ? 25 శాతంఈ నిష్పత్తి ప్రకారం స్థానిక కాంట్రాక్టర్లకు నామినల్ రేట్లపై పనులు కేటాయించి తమ ఉపాధిని కాపాడాలని వినతిపత్రంలో కోరారు.




## కేఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్పర్సన్ శ్రీ కె. నాగమణి గారికి ప్రతిష్ఠాత్మక "శిక్షా రత్న-2026" పురస్కారం

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 7, (జనంసాక్షి);** విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న కేఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్పర్సన్ కె. నాగమణికి ప్రతిష్ఠాత్మక "శిక్షా రత్న - 2026" పురస్కారం లభించింది. విద్యాసంస్థల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ఆధునిక విద్యా విధానాలను ప్రోత్సహించడం వంటి సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని సోమవారం అందజేశారు. ఈ పురస్కార కార్యక్రమాన్ని హరి విశ్వవిద్యాలయం, సూపర్ ఏఐ అకాడమీ, అదాబ్ హైదరాబాద్, సాక్షి ఎడ్యుకేషన్ మరియు స్టడీ9 మీడియా సంయుక్తంగా నిర్వహించాయి. కార్యక్రమానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ డా. వి. బాలకృష్ణ రెడ్డి , ఐసీఏఆర్-ఏఐసీఆర్పీ డైరెక్టర్ డా. తారా సత్యవతి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. వారి సమక్షంలో కె. నాగమణికి "శిక్షా రత్న-2026" పురస్కారాన్ని అందజేశారు.

కె. నాగమణి నాయకత్వంలో కేఎస్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన మరియు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోంది. విద్యాసంస్థల అభివృద్ధి, ఆధునిక మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు అందించడంలో కె. నాగమణి కృషి ప్రశంసనీయమని పలువురు అభినందించారు. "శిక్షా రత్న-2026" పురస్కారం కె. నాగమణి విద్యారంగ సేవలకు, దూరదృష్టితో కూడిన నాయకత్వానికి మరియు విద్యాసంస్థల నిర్మాణంలో చేసిన కృషికి తగిన గుర్తింపుగా లభించింది. ఈ సందర్భంగా కేఎస్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ యాజమాన్యం, ప్రిన్సిపాళ్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది మరియు విద్యార్థులు కె. నాగమణి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఆమె నాయకత్వంలో సంస్థలు మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య

## మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి

**హాలియా (జనంసాక్షి) సెప్టెంబర్ 7**

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తుందని హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి వైస్ చైర్మన్ రాజా రమేష్ యాదవ్ , హాలియా మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సోమవారంయూనిఫాం మరియు షూస్ పంపిణీ పంపిణీ చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన అనేక సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని చదువులు రాణించాలని సూచించారు .?ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బొంగరాల యేసు రాజు గారు, కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు గారు, కౌన్సిలర్ సలహాదారులు నకిరేకంటి సైదులు గారు, మజహార్ మొయినుద్దీన్ గారు, చిట్టిపోలు కరుణాసాగర్ గారు, గడ్డం రమణయ్య గారు, కుకడాల ఆంజనేయులు గారు, మద్దిమడుగు కిషోర్ గారు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయపాల్ రెడ్డి గారు బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.





# ప్రశ్నించే గొంతుక లేకుండా చేసే కుట్ర

## - కనీస వేతనాల సలహా మండలి నుంచి సీఐటీయూ మినహాయింపుపై నిరసన

**భద్రాచలం సెప్టెంబరు 07 (జనంసాక్షి)**

కనీస వేతనాల సలహా మండలి నుంచి సీఐటీయూతో పాటు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీలను మినహాయించడం కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చర్య అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏజే రమేష్ విమర్శించారు. సోమవారం భద్రాచలంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహించిన నిరసన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిన కేంద్ర ప్రభుత్వం, కార్మిక సంఘాల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. కనీస వేతనాల నిర్ణయంలో త్రైపాక్షిక కమిటీ కీలకమని, కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం లేకుండా చేయడం కార్పొరేట్ శక్తులకు అనుకూలమన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు బలమైన కార్మిక ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎంబీ నర్సారెడ్డి, బందారు శరత్‌బాబు, నకిరికంటి నాగరాజు, కాపుల రవి, మనోజ్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



# పెంట్లంలో టీబీ ముక్త భారత్ అభియాన్!

## 63 మందికి మొబైల్ ఎక్స్‌రే పరీక్షలు.. 13 మంది టీబీ అనుమానితుల గుర్తింపు

**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 7, జనంసాక్షి**

భారతదేశాన్ని క్షయ వ్యాధి (టీబీ) రహిత దేశంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'టీబీ ముక్త భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా పెంట్లం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కారం శివ శిబిరాన్ని ప్రారంభించారు. ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ నాజనీన్ తబస్సుమ్ పర్యవేక్షణలో నిర్వహించిన శిబిరంలో అత్యాధునిక డిజిటల్ మొబైల్ ఎక్స్‌రే యూనిట్ ద్వారా గ్రామ పంచాయతీ పరిధిలోని 63 మందికి ఛాతీ ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో ప్రాథమికంగా 13 మందిలో టీబీ అనుమానిత లక్షణాలు గుర్తించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ నాజనీన్ తబస్సుమ్ మాట్లాడుతూ రెండు వారాలకు మించి తగ్గని దగ్గు, సాయంత్రం వేళల్లో జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఇలాంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. టీబీ అనుమానితులకు తదుపరి కళ్లె (స్పుటమ్), రక్త పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉచిత మందులు, వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. అలాగే నిక్షయ్ పోర్టల్ ద్వారా టీబీ రోగులకు పౌష్టికాహారం కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

**అబ్బుగూడెంలో 9న.. పెద్దిరెడ్డిగూడెంలో 11న**

అన్నపురెడ్డిపల్లి మండలంలోని ఇతర గ్రామాల్లోనూ మొబైల్ ఎక్స్‌రే శిబిరాలను నిర్వహించనున్నట్లు వైద్యురాలు తెలిపారు. ఈ నెల 9న అబ్బుగూడెం గ్రామ పంచాయతీలో, 11న పెద్దిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీలో శిబిరాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈవో ప్రకాశరావు, పంచాయతీ కార్యదర్శి వెంకటమ్మ, టీబీ సూపర్‌వైజర్ వెంకట్, ఎక్స్‌రే టెక్నీషియన్ సాయి కృష్ణ, ఆశా కార్యకర్తలు ప్రియాంక, లక్ష్మి, రాధాజ్యోతి, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్ష గొంతు నొక్కుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం!

## ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారంటూ బీఆర్ఎస్ నేతల ఆగ్రహం

## ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని మండిపాటు

**మర్రిగూడ, సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలకు ప్రశ్నించే హక్కు ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం ఆ హక్కును అణిచివేసే విధంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ నాయకులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్‌లను అసెంబ్లీ గేటు వద్ద అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె రవికుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం మర్రిగూడ ఎంపీడీవో మునయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పల్లె రవికుమార్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన ప్రతిపక్ష నాయకులను అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వం తన వైఫల్యాలను ప్రశ్నించే గొంతులను అణిచివేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ దంటు జగన్, బచ్చు రామకృష్ణ,సర్పంచ్లు వల్లంల సంతోష్ యాదవ్, సీతారాం నాయక్, రొక్కం భాస్కర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్ గౌడ్, పిఏసిఎస్ మాజీ చైర్మన్ పందుల యాదయ్య,మాజీ ఎంపీటీసీలుఊరిపక్క నగేష్,మారగోని వెంకటయ్య, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య,ఐలులి లక్ష్మి నరసింహ,అంతిరెడ్డి, పందుల యాదయ్య, నాయకులు కోలుకులపల్లి యాదయ్య, వనమాల మహేష్, నాగరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# ఆటో డ్రైవర్ల కు ట్రాఫిక్ నియమాల పై అవగాహన కల్పించిన డీఎస్పీ

## మత్తు పదార్థాల వాడకం, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు - డీఎస్పీ రవీందర్ రెడ్డి



**మణుగూరు, సెప్టెంబరు 07 (జనంసాక్షి):** ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ బాధ్యతాయుతంగా ఆటోలను నడపాలని డిఎస్పి రవీందర్ రెడ్డి అన్నారు.సోమవారం మణుగూరు సబ్ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఆటో డ్రైవర్ల కు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రోడ్డు భద్రత నిబంధన ఉల్లంఘిస్తూ నేరాలకు పాల్పడిన, చిన్న చిన్న విషయాలకు ఘర్షణలు పడుతూ ప్రజలను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రయాణికుల భద్రత ప్రాధాన్యత ఇస్తూ నిబంధనలు పాటించి రక్షణ తో పాటు బాధ్యతతో నడపాలని సూచించారు.

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు:**

ఆటో నడిపేటప్పుడు డ్రైవర్లు తప్పనిసరిగా ఖాకీ యూనిఫామ్ ధరించాలి బ్యాడ్జ్ కలిగి ఉండాలి. డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పొల్యూషన్ సర్టిఫికెట్ ఎల్లప్పుడూ ఆటోలో అందుబాటులో ఉంచుకోవాలి. ప్రయాణికులకు కనిపించేలా ఆటోలో డ్రైవర్ పేరు, ఫోన్ నంబర్, ఆటో నంబర్ స్థానిక పోలీస్ స్టేషన్ నంబర్ లేదా హెల్ప్‌లైన్ నంబర్ (డయల్ 100/112) ఉన్న కార్డును ప్రదర్శించాలి.రోడ్డు మధ్యలో లేదా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా ఆటోలను నిలపకూడదు. ఆటో యూనియన్ వారు ఆటో స్టాండ్ లో ఆటో నెంబరు పేరు కాంటాక్ట్ వివరాలు ఆటో స్టాండ్ లో పొందుపరచాలి .కేటాయించిన ఆటో స్టాండ్లలో మాత్రమే వరుస క్రమంలో ఉంచాలి. రోడ్డు అడ్డంగా ఆటోలు నిలిపినా, ప్యాసింజర్లపై దురుసుగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యల తో పాటు లైసెన్స్ రద్దు చేసి ఆటోలను సీజ్ చేస్తామని తెలిపారు.

**సామాజిక బాధ్యత నేరాల నియంత్రణ:**

ఆటోలో ప్రయాణించే వారిలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపించినా, లేదా మత్తు పదార్థాలు, అక్రమ వస్తువులు రవాణా చేస్తున్నట్లు అనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి. ప్రయాణికులు పొరపాటున ఆటోలో మర్చిపోయిన బ్యాగులు, మొబైళ్లు లేదా నగదును పోలీస్ స్టేషన్‌లో అప్పగించి నిజాయితీ చాటుకోవాలి. రాత్రి సమయాల్లో ప్రయాణించే మహిళా ప్రయాణికుల పట్ల మరింత బాధ్యతగా వ్యవహరించాలి. వారి భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా చూసుకోవాలి. ప్యాసింజర్ల నుంచి అనవసరంగా అదనపు వసూళ్లకు పాల్పడకూడదు. మీటర్ లేదా నిర్ణీత ధరల ప్రకారమే ఛార్జీలు వసూలు చేయాలి.పాఠశాల పిల్లలను తీసుకెళ్లే ఆటోలలో పరిమితికి మించి పిల్లలను ఎక్కించకూడదు. వారి బ్యాగులను సురక్షితంగా ఉంచాలి.రోడ్లపై ఆటోలను జిగ్‌జాగ్‌గా నడపడం, అకస్మాత్తుగా బ్రేకులు వేయడం లేదా అతివేగంతో ఓవర్‌టేక్ చేసి చిన్న పిల్లలు మహిళలను ఇబ్బందికి గురి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ అవగాహన కార్యక్రమంలో సిఐ నాగబాబు తో పాటు, ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, అశ్వాపురం సిఐ ఎల్లయ్య, ఎస్సైలు సురేష్,నగేష్ ,వియన్ రావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆరు గ్యారెంటీలను తక్షణం అమలు చేయాలి

### బీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్

**ఖమ్మం రూరల్,సెప్టెంబర్ 7(జనంసాక్షి)** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా 6 గ్యారంటీలకు సంబంధించిన పథకాలను తక్షణం అమలు చేయాలని బి ఆర్ ఎస్ పార్టీ ఖమ్మం రూరల్ మాజీ అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్ డిమాండ్ చేశారు.బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా సోమవారం పార్టీ నాయకులతో కలిసి వేణుగోపాల్ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ కు గ్రీవెన్స్ లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలతో కూడిన హామీలను ఇవ్వడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు పూర్తి కావస్తున్న ఏ ఒక్క పథకం పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదన్నారు. మహిళలకు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుద్యోగులు, విద్యార్థులను ప్రభుత్వం మోసం చేసిందని ఆయన తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనియెడల ప్రజా పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పేరం వెంకటేశ్వర్లు. జరుపుల లక్ష్మణ్ నాయక్, ముత్యం కృష్ణారావు, మేదరమెట్ల శ్రీనివాసరావు, గుడిబోయిన దర్గయ్య,గూడా సంజీవరెడ్డి, భాస్కరరావు, అక్కినపల్లి వెంకన్న, బానోతు కృష్ణ, చుంచు నారాయణ, వెంపటి ఉపేందర్, మైబెల్లి సాహెబ్,కొళ్ళపూడి రవి తదితరులు పాల్గొన్నారు.

## గోల్డ్ మెడల్ విజేత నాగ పున్నారెడ్డికి ఘన సన్మానం



**బూర్గంపహాడ్ సెప్టెంబరు 07 (జనంసాక్షి)** జిల్లా స్థాయి బెంచ్‌ప్రెస్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన లక్ష్మీపురం గ్రామానికి చెందిన యారం నాగ పున్నారెడ్డిని గ్రామ యువత ఘనంగా సన్మానించారు. పాల్వంచలోని ఇంజనీరింగ్ అసోసియేషన్ హాల్‌లో ఇటీవల నిర్వహించిన పోటీల్లో జూనియర్ మెన్స్ 120 కేజీల విభాగంలో నాగ పున్నారెడ్డి ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం రాత్రి లక్ష్మీపురంలో గ్రామ యువత, మిత్రులు, శ్రేయోభిలాషుల ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. నాగ పున్నారెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. జిల్లా స్థాయిలో సాధించిన ఈ విజయం గ్రామానికి గర్వకారణమని, యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ రాణించి మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఉప సర్పంచ్ యారం పున్నారెడ్డి, మాజీ వార్డు సభ్యుడు పాలం దివాకర్‌రెడ్డి, గ్రామ యువత, మిత్రులు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.



## చెరువు సింగారం బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో!

### రోడ్డు మంజూరుకు ఐటీడీఏ పీఓకు ముసలిమడుగు సర్పంచ్, ఉప సర్పంచ్ వినతి

**బూర్గంపహాడ్ సెప్టెంబరు 07 (జనంసాక్షి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం ముసలిమడుగు గ్రామపంచాయతీ పరిధిలోని చెరువు సింగారం గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేయాలని కోరుతూ ముసలిమడుగు సర్పంచ్ పూనెం సురేంద్ర, ఉప సర్పంచ్ సీహెచ్ కుమారి సోమవారం భద్రాచలం ఐటీడీఏ పీఓను కలిసి వినతిపత్రం అందజేశారు. చెరువు సింగారం గ్రామానికి క్రాస్‌రోడ్ నుంచి గ్రామం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు పీఓ దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు మంజూరు కోసం అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ స్పందిస్తూ.. రోడ్డు నిర్మాణానికి ఇప్పటికే ఎస్టిమేషన్ రూపొందించామని తెలిపారు. ప్రస్తుతం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సంబంధిత శాఖల అనుమతుల కోసం ఫైల్ పెండింగ్‌లో ఉందని చెప్పారు. మరోసారి సంబంధిత అధికారులతో అనుమతులపై చర్చించి, బీటీ రోడ్డు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రోడ్డు మంజూరైతే చెరువు సింగారం గ్రామ ప్రజల రాకపోకలకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని సర్పంచ్, ఉప సర్పంచ్ తెలిపారు.

## ఎమ్మెల్సీ తాతా మధు రాజీనామా చేయాలి

### ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్

ఖమ్మం కార్పొరేషన్, సెప్టెంబర్ 7 (జనం సాక్షి ) తెలంగాణ శాసనసభ స్పీకర్, దళిత బిడ్డ గడ్డం ప్రసాద్ కుమార్ పట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ అన్నారు.రాజ్యాంగ బద్ధమైన అత్యున్నత పదవుల్లో ఒకటైన శాసనసభ స్పీకర్ పదవికి గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత ప్రతి ప్రజాప్రతినిధిపై ఉందని ఆయన అన్నారు. ఒక దళిత బిడ్డ శాసనసభ స్పీకర్‌గా ఎదగడం వెనుక రాజ్యాంగం కల్పించిన సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య విలువలు ఉన్నాయని పేర్కొన్నారు.దళితుల పట్ల అవమానకరంగా, అనుచితంగా మాట్లాడే హక్కు ఏ రాజ్యాంగం ఇచ్చింది? ప్రజా జీవితంలో ఉన్న నాయకులు ఇలాంటి భాషను ఉపయోగించడం సమాజానికి ఏ సందేశం ఇస్తుంది?" అని ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ ప్రశ్నించారు. అంతేకాకుండా, "తాతా మధుసూదన్, ఎమ్మెల్సీగా ఎన్నికై ఈ స్థాయికి రావడానికి కూడా ఇదే ప్రజాస్వామ్య వ్యవస్థ, ఇదే రాజ్యాంగం కారణం. స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పడంతో పాటు, తన ఎమ్మెల్సీ పదవికి తాతా మధుసూదన్ తక్షణమే రాజీనామా చేయాలని పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ డిమాండ్ చేశారు.దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలను ఇకపై సహించేది లేదని, సామాజిక సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గ ప్రసాద్ స్పష్టం చేశారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తేసహించేదిలేదు

### ఎస్సిసెల్ మండలఅధ్యక్షుడు పాలకుర్తి రవి

**ములకలపల్లి సెప్టెంబర్ 7 జనంసాక్షి :** దళితవర్గానికిచెందిన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డంప్రసాద్ కుమార్ పై బీఆర్ఎస్ పార్టీ నాయకులుఅనుచితవ్యాఖ్యలు చేయడంసరికాదని కాంగ్రెస్ పార్టీ ఎస్సిసెల్ మండల అధ్యక్షుడు పాలకుర్తిరవి అన్నారు . స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలనిఆయన డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని దళిత సంఘాలన్నీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కు వెన్నుదన్నుగా నిలవాలని ఆయన కోరినారు. ఎంతో పెద్ద స్థాయికి చేరిన గడ్డం ప్రసాద్ లాంటి దళితులను కూడా టిఆర్ఎస్ పార్టీ ఈ విధంగా కించపరుస్తుందంటే, మిగిలినవారు అర్థం చేసుకుని దళితులందరు ఏకటాటి పైకి వచ్చి బిఆర్ఎస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని ఆయన కోరినారు.

### కమ్మ సేవా సంఘం ఆధ్వర్యంలో

## ఘనంగా వనమహోత్సవం

**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 07(జనం సాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని కమ్మ సేవా సంఘం కార్యాలయ ఆవరణలో సోమవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహ పూరితమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో నిర్వహించారు. సంఘం నాయకులు, కార్యకర్తలు కలసి వివిధ రకాల పండ్ల, పూల మొక్కలను నాటారు.?మామిడి, నిమ్మ, కొబ్బరి, ఉసిరి, మారేడు, జమ్మి, పనస, సపోటా, శమీ, రావి చెట్లతో పాటు అనేక రకాల పూల జాతి మొక్కలను ఈ సందర్భంగా నాటడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా సుమారు 69 రకాలకు చెందిన 300 మొక్కలను ప్రాంగణంలో నాటారు. నాటిన ప్రతి ఒక్కరూ ఆ మొక్కలను పెంపొందించి సంరక్షించే బాధ్యతను కూడా స్వీకరించడం విశేషం.ఈ వనమహోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితా కుమారి, కార్యకర్తలు అడుసుమిల్లి సాయిబాబు, మాజీ వైస్ ఎంపీపీ భవిత, పైడిపల్లి జయలక్ష్మి, సంఘ ప్రధాన కార్యదర్శి హరి సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, ప్రముఖులు కొత్త వెంకటేశ్వర్లు, డాక్టర్



బిక్కసాని సుధాకర్, తెనగల అనంతరాములు, మల్లెల కవిచంద్ర, చిన్నంబయార ట్రస్ట్ బాధ్యులు కంచర్ల రోజారమణి తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ వద్ద అరెస్టులపై వైరాలో గులాబీ నిరసన

- ◆బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం
- ◆ప్రజా సమస్యలను ప్రశ్నించే హక్కును కాలరాయొద్దు
- ◆ఆరు గ్యారెంటీలు, హామీలను అమలు చేయాలి: బీఆర్ఎస్ నేతలు



**వైరా జనంసాక్షి**

సెప్టెంబర్ 7న తెలంగాణ అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ వైరాలో బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కట్టా కృష్ణార్జునరావు, బాణాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రింగ్‌రోడ్డు వద్ద నిర్వహించిన నిరసనలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.అసెంబ్లీకి నల్ల టీషర్టులతో వెళ్లిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, పలువురు నేతలను అదుపులోకి తీసుకోవడాన్ని వారు ఖండించారు. ప్రజా సమస్యలను అసెంబ్లీ వేదికగా ప్రశ్నించడం ప్రతిపక్షం హక్కు అని, ప్రశ్నించే గొంతును అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపైనా వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పార్లమెంట్‌లో నల్ల దుస్తులతో నిరసన తెలిపే అవకాశం ఉన్నప్పుడు తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు అదే హక్కు ఎందుకు ఉండకూడదని చంద్రావతి, కట్టా కృష్ణార్జునరావు ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 13 డిక్లరేషన్లు, 420 హామీల అమలుపై ప్రజల్లో అనేక ప్రశ్నలు ఉన్నాయని పేర్కొన్నారు. మహిళలకు నెలకు రూ.2,500, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్, విద్యార్థులకు స్కూటర్లు, కల్యాణలక్ష్మి?షాదీ ముబారక్‌లో తులం బంగారం, అర్హులైన పేదలకు ఇళ్ల వంటి హామీలను ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పోరాటం ఆగదని మాజీ ఎమ్మెల్యే బాణోత్ చంద్రావతి స్పష్టం చేశారు. అసెంబ్లీ నుంచి గ్రామస్థాయి వరకు ప్రజల గొంతుకగా గులాబీ జెండా నిరంతరం పోరాడుతుందని అన్నారు. అనంతరం ప్రజల నుంచి సేకరించిన వివిధ సమస్యలపై వినతిపత్రాలను ప్రజావాణిలో అధికారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో 8 వార్డు కౌన్సిలర్ చిలక కోటయ్య, 11వ వార్డు కౌన్సిలర్ దొంతి బోయిన వెంకటేశ్వర్లు ,లాల్ మహమ్మద్ ,మాజీ సర్పంచ్ భట్ట భద్రయ్య, వాసిరెడ్డి రవి,సక్కుబాయి , అప్పం సురేష్, గుజ్జర్లపూడి దేవరాజు,కామినేని శ్రీనివాసరావు, తిరుపతి శ్రీను పాసంగలపాటి శివ, ఏదినూరి శ్రీను,కోల్ల రాంబాబు,సైదా,ఆదూరి ప్రేమ్, అయినా అలా కనకరత్నం, మన్యం సత్యానందం, నూకల ప్రసాద్, మిట్టపల్లి సత్యంబాబు, సింగవరపు నరేష్, వేముల శివ. సోమవారం వల్లేపు రాము, తదితరులు పాల్గొన్నారు.



## సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ వచ్చే వరకు పోరాడుతాం

సూర్యాపేట (జనంసాక్షి):

మొదట ప్రకటించిన విధంగా బుల్లెట్ ట్రైన్ సూర్యాపేట మీదుగా వెళ్లే వరకు ఆటోనగర్ మెకానిక్ సంఘం ఆధ్వర్యంలో తీవ్రంగా పోరాడతామని ఆ సంఘం అధ్యక్షులు రాందేని అదినారాయణ అన్నారు.బుల్లెట్ ట్రైన్ సాధన రిలే నిరాహార దీక్షలో సోమవారం ఆ సంఘ నాయకులు,సభ్యులు పాల్గొన్నారు.అంతకుముందు బైక్ ర్యాలీ నిర్వహించి బుల్లెట్ ట్రైన్ ఉద్యమంకు సంపూర్ణ మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్, జాతీయ రహదారి 65కు సమాంతరంగా రైల్వే కారిడార్ ఏర్పాటు చేసే వరకు పోరాడుతామన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి గుగులోతు సోమ్లా నాయక్, ఉపాధ్యక్షులు దేశోజు యాదగిరి, కోశాధికారి ఎస్ కె.సలీం, కార్యదర్శి కడారి వెంకన్న, సహాయ కార్యదర్శి దీకొండ మల్లయ్య, ఎస్ కె.జానీ, చిలుకూరి శివాజీ, పామిశెట్టి బాలశౌరి, ఎస్ కె.పెద్దమస్తాన్, పందిరిపల్లి శ్రీనివాసరావు, కుంచారపు నాగిరెడ్డి, గంపల బాలయ్య, బి.సంపత్ కుమార్, బంధనాదం, రాజు, పరుచూరి చక్రవర్తి, టీవీఎస్ రమేష్, సతీష్, గుడిపూడి నాగరాజు, లక్ష్మణ్, చంద్రారెడ్డి, ఖాదర్, షేక్ ఖాజా మియా తదితరులు పాల్గొన్నారు.బుల్లెట్ ట్రైన్ సాధన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఆటోనగర్ మెకానిక్ లకు మాజీ మార్కెట్ చైర్మన్ పెద్దిరెడ్డి రాజా, బుల్లెట్ ట్రైన్ సాధన కన్వీనర్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి, రమణచారి,డేవిడ్ కుమార్, బూర వెంకటేశ్వర్లు, పేర్ల నాగయ్య, వెలుగు వనిత, నేరెళ్ల మధు, సట్టు నాగయ్య తదితరులు సంఘీభావం తెలిపారు.

## తేరట్టుపల్లిలో ఘనంగా బీరప్ప బోనాలు

**చండూరు, సెప్టెంబర్ 7 (జనంసాక్షి)**



గట్టుప్పల మండలం తెరట్టుపల్లి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో మహిళలు వల్లూరి శ్రీశైలం గారి ఒగ్గు కళాకారుల డప్పు వాయిద్యాల తో ఘనంగా శ్రీ బీరప్ప స్వామికి బోనాలు తీశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న చండూరు మాజీ జెడ్పిటిసి కర్నాటి వెంకటేశంమరియు కేవైసీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుడె వెంకటేష్ లు మాట్లాడుతూ శ్రీ బీరప్ప స్వామి కరుణ కటాక్షాలు తేరటుపల్లి గ్రామ ప్రజలు మరియు తెలంగాణ రాష్ట్ర ప్రజలపై ఉంచి సకాలంలో వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలతో విరజిల్లాలని శ్రీ బీరప్ప స్వామి వారిని కోరారు ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు గొరిగే సత్తయ్య పెద్ద కురుమ బండ నరేందర్ సెల్లోజి బండ యాదయ్య మలిగే ఆంజనేయులు వల్లూరి రమేష్ మలిగే మల్లేష్ కేవైసీ ఎస్ నాయకులు బండ శ్రీకాంత్ అచ్చిన రాములు గొరిగే యాదయ్య దెండే యాదయ్య బండ నాగరాజు కురుమ కుల పెద్దలు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు పెద్దమ్మ తల్లి ఆశీస్సులు పొందాలి

### ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి

**చింతపల్లి , సెప్టెంబర్ 07(జనంసాక్షి)**



ప్రతి ఒక్కరు పెద్దమ్మ తల్లి ఆశీస్సులు పొందాలని తీదేడు గ్రామ సర్పంచ్ ఉలుపాల స్వప్న శేఖర్ రెడ్డి అన్నారు.చింతపల్లి మండలం తీదేడు గ్రామ మల్లికార్జున స్వామి యాదవ సంఘం అధ్యక్షులు మర్ల యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దమ్మ తల్లి పండుగ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆమె మాట్లాడుతూ...గ్రామ ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారని ఆమె తెలిపారు.పెద్దమ్మ , ముత్యాలమ్మ పండుగను విజయవంతంగా నిర్వహించిన గ్రామ యాదవ సంఘం పెద్దలకు,యువత, మహిళలు,భక్తులు,ప్రజలకు ఆమె ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మల్లికార్జున స్వామి యాదవ సంఘం అధ్యక్షులు మర్ల యాదగిరి,ఉప సర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్,మల్లికార్జున యాదవ సంఘం కమిటి సభ్యులు,యువకులు,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లందుకు సీతారామ ప్రాజెక్టు నీరు అందించాలి

- ◆ బోడు కేంద్రాలుగా రెవెన్యూ మండలం ఏర్పాటు చేయాలి..
- ◆ కరెంటు కోతలు, లో-వోల్టేజ్ సమస్యలను పరిష్కరించాలి..
- ◆ అఖిలభారత ఐక్య రైతు సంఘం డిమాండ్..



**టేకులపల్లి, సెప్టెంబర్ 7(జనంసాక్షి):**

ఇల్లందు నియోజకవర్గానికి సీతారామ ప్రాజెక్టు నీటిని అందించాలని, బోడు కేంద్రాలుగా రెవెన్యూ మండలం ఏర్పాటు చేయాలని, కరెంటు కోతలు లో-వోల్టేజ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.సోమవారం టేకులపల్లి తాసిల్దార్ కు అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో మేమోరాండం అందజేశారు.అందులో అఖిలభారత ఐక్య రైతు సంఘం జాతీయ నాయకులు, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య పాల్గొని మాట్లాడారు.ఇల్లందు నియోజకవర్గం పూర్తిగా గిరిజన ప్రాంతమైనప్పటికీ ప్రభుత్వాలు ఈ ప్రాంతం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని గుమ్మడి నరసయ్య విమర్శించారు. వెనుకబడిన ఇల్లందు ప్రాంతానికి సాగునీరు అందించకుండా, ఇప్పటికే నీటి వనరులు సమృద్ధిగా ఉన్న ప్రాంతాలకు సీతారామ ప్రాజెక్టు నీటిని తరలించడం సరికాదన్నారు. సీతారామ ప్రాజెక్టు నీటిని ఇల్లందు నియోజకవర్గా నికి అందించకపోతే ఈ ప్రాంతానికి శాశ్వత సాగు నీటి వనరులు ఏర్పాటు చేయడం మరింత కష్టమ వుతుందని అన్నారు. ఇల్లందు నియోజకవర్గ ప్రజలు సాగునీటి కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు.సంఘం జిల్లా అధ్యక్షు లు బుర్ర వెంకన్న మాట్లాడుతూ, బోడు కేంద్రంగా రెవెన్యూ మండలాన్ని ఏర్పాటు చేయడానికి అవస రమైన అన్ని సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. అలాగే మండలంలో వర్షాభావ పరిస్థితుల వల్ల వేసిన పంటలను బోర్లు, బావుల ద్వారా కాపాడుకో వాల్సిన పరిస్థితి ఏర్పడిందని కరెంటు కోతల వల్ల బోర్ల నుంచి నీళ్లు తోడలేని పరిస్థితి ఏర్పడ్డాయని, పంటలు ఎండిపోతుంటే రైతులు ఆవేదన చెందుతు న్నారని కరెంటు కోతలు లో వోల్టేజీ సమస్యను పరిష్కరించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్స్ తో కూడిన వినతి పత్రాన్ని తాసిల్దార్ కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బానోతు పంతులు, ధర్మపురి వీర బ్రహ్మాచారి,సుడిగాలి వెంకన్న,సుందర్ తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారుల మన్ననలు పొందాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**

జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ సెంటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హోటల్ బొమ్మరిల్లు గ్రాండ్ ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులు మాట్లాడుతూ వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని అన్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించి వ్యాపారంలో మరింతగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం హోటల్ బొమ్మరిల్లు గ్రాండ్ నిర్వాహకులు మాట్లాడుతూ తాము అందించే క్వాలిటీ, టేస్టీ ఫుడ్స్ ను సూర్యాపేట పట్టణ,పరిసర ప్రాంత ప్రజలు ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హోటల్ బొమ్మరిల్లు గ్రాండ్ నిర్వాహకులు మీలా వంశీ, గార్లపాటి వెంకటరెడ్డి, కేతిరెడ్డి నవీన్ రెడ్డి,పలువురు ప్రజా ప్రతినిధులు, పట్టణ



ప్రముఖులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిబద్ధత గల కమ్యునిస్టు నర్రా రమేష్

### సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్

## విద్యార్థి యువజన ఉద్యమ నిర్మాతలలో ఒకరు నర్రా రమేష్

### సిపిఐ(యం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు




**ఖమ్మం, ఖమ్మం కార్పొరేషన్, (జనంసాక్షి) :**
సిపియం పార్టీ మాజీ జిల్లా కమిటీ సభ్యులు నర్రా రమేష్ నిబద్ధత గల కమ్యూనిస్టు నాయకుడు అని సిపియం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో సిపియం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ అధ్యక్షతన జరిగిన నర్రా రమేష్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. నర్రా రమేష్ విద్యార్థి, యువజన, కార్మిక ఉద్యమాలలో క్రియాశీలకంగా పనిచేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా వందల మందిని ప్రజా ఉద్యమాల వైపు నడిపించడంలో క్రియాశీలకంగా పని చేశారని గుర్తు చేశారు.నర్రా రమేష్ మున్సిపల్ కౌన్సిలర్ గా ప్రజలకు సేవ చేశారని కొనియాడారు.ఖమ్మం నగరంలో సిపియం పార్టీ విస్తరణ కోసం నిరంతరం కృషి చేశారని కొనియాడారు.ఆయన కృషిని,ఆశయాలను ముందుకు తీసుకెళ్ళడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించగలమని తెలిపారు. ఈ వర్ధంతి సభలో సిపియం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ నర్రా రమేష్ విప్లవోద్యమ కృషిని అభినందించారు.నర్రా రమేష్ సృజనాత్మకంగా పని చేసేవాడని,తన మాటలతో, పాటలతో ప్రజా కళలతో ప్రజలను చైతన్యం చేసేవాడని కొనియాడారు.ప్రజలను కూడగట్టడంలో, కమ్యునిస్టు కార్యకర్తలను చైతన్యవంతం చేయడంలో ఆయన ముందుండే వాడని తెలిపారు.ప్రజా ఉద్యమాలకు రూపకల్పన చేస్తూ , ప్రభుత్వాలపై ఒత్తిడి పెంచుతూ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారని అన్నారు.ప్రతి కమ్యునిస్టు కార్యకర్త, నాయకుడు నర్రా రమేష్ పని పద్ధతులను, సృజనాత్మక కృషిని అలవర్చుకోవాలని అదే ఆయనకు



ఇచ్చే నివాళి అని తెలిపారు. ఈ వర్ధంతి కార్యక్రమం లో నర్రా రమేష్ కుటుంబ సభ్యులు, సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాదినేని రమేష్,బండి పద్మ,మెరుగు సత్యనారాయణ,జిల్లా కమిటీ సభ్యులు దొంగల తిరపతిరావు, ఓం.జబ్బార్, ూఐ. మీరా సాహెబ్, బండారు రమేష్, భుక్యా శ్రీనివాసరావు, నందిపాటి మనోహర్, మెరుగు రమణ, డివిజన్ నాయకులు శ్రీనివాసరావు, బోడపట్ల సుదర్శన్, మీరా, జె వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా పాలన కాదు..

## ప్రజా వంచన పాలన

### పోలీసుల తీరుపై బీఆర్ఎస్ యువజన నేత ప్రవీణ్ ప్రకాష్ నాయక్ ఆగ్రహం

**చంద్రుగొండ, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలపై అసెంబ్లీలో ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అక్రమంగా నిర్బంధించారని బీఆర్ఎస్ మండల యువజన విభాగం అధ్యక్షుడు, తుంగారం సర్పంచ్ గుగులోత్ ప్రవీణ్ ప్రకాష్ నాయక్ ఆరోపించారు. ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్‌తో లోక్‌సభకు వెళ్లడంలో అభ్యంతరం లేనప్పుడు, తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకోవడం ఏమిటని ప్రశ్నించారు.మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో పోలీసులు అమానుషంగా వ్యవహరించ డాన్ని తీవ్రంగా ఖండించారు. మహిళా ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ పాలనలో మహిళల పట్ల ఇలాంటి ప్రవర్తన సిగ్గుచేటని విమర్శించారు.ఈ కార్యక్రమంలో నల్లమోతు వెంకటనారాయణ, ఉన్నం నాగరాజు, బానోత్ బాలు నాయక్, బడికల శ్రావణ్ కుమార్, మేడా మోహన్ రావు, భూపతి రమేష్, కేలోత్ శ్రీను నాయక్, పూసం వెంకటేశ్వర్లు, ఉప్పతల గణేష్, మంద అనిల్, పోశం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



### శ్రీ విజయ గణపతి రైస్ ఇండస్ట్రీస్ మిల్లును ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దయానంద్

**పెనుబల్లి, సెప్టెంబర్ 7(జనంసాక్షి)**
పెనుబల్లి మండలం లంకసాగర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ విజయ గణపతి రైస్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును సోమవారం రాష్ట్ర కాంగ్రెస్ పార్టీనాయకులు డాక్టర్ మట్టా దయానంద విజయ్ కుమార్ ప్రారంభించారు.ఈ సందర్భంగా రైస్ మిల్లు నిర్వాహకులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, వ్యాపార సంస్థలు ఏర్పాటు కావడం ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు రైతులకు కూడా ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పంది వెంకటేశ్వరరావు,కల్లూరు ఏఎంసీ వైస్ చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, పెనుబల్లి మండల కాంగ్రెస్ నాయకులు, లంకసాగర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్యంలో ఎమ్మెల్యేలపై దౌర్జన్యం ఏమిటి ?

### మాజీ ఎమ్మెల్యే మెచ్చ

**చంద్రుగొండ, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):**
అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై తీవ్రంగా విమర్శలు చేశారు.ఈ సందర్భంగా మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పుతున్న బీఆర్ఎస్ నేతలను అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. కేటీఆర్, హరీష్‌రావుతో పాటు మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. రాష్ట్రంలో ప్రజా పాలన సాగుతోందా, రౌడీ రాజ్యమా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.అదేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరరావు విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ చంద్రుగొండ ఎంపీడీవో అశోక్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నల్లమోతు వెంకటనారాయణ, మేడా మోహన్‌రావు, ప్రవీణ్ ప్రకాష్, కృష్ణవేణి, భూపతి రమేష్, భూపతి శ్రీను, అంజనరావు, ఉప్పతల గణేష్, మంద అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## 420 హామీలు అమలు చేయాలి

## లేకుంటే రాజీనామా చేయాలి

### ప్రజావాణిలో బీఆర్ఎస్ నాయకుల వినతిపత్రం

**చంద్రుగొండ, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):**
అధికారంలోకి వచ్చేందుకు ఇచ్చిన 420 హామీలను వెంటనే అమలు చేయాలని, హామీలు అమలు చేయలేని పక్షంలో ప్రభుత్వం రాజీనామా చేసి ఎన్నికలకు రావాలని చంద్రుగొండ మండల బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ వెయ్యి రోజుల విఫల పాలనకు నిరసనగా ప్రజావాణిలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. తొలుత ప్రధాన సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా పట్టణ మాజీ అధ్యక్షుడు సూరా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజలతో కలిసి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షుడు నరకుళ్ల సత్యనారాయణ, సర్పంచ్ ఇర్ప స్రవంతి, సయ్యద్ జాఫర్‌మియా, మాజీ మండల ప్రధాన కార్యదర్శి సంగొండి రాఘవులు, మాజీ మండల ఉపాధ్యక్షుడు సత్తి నాగేశ్వర రావుతో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## అన్నదానం, గోశాలకు రూ.5 లక్షల విరాళం

### - భద్రాద్రి రామాలయ ఈఓ కే. దామోదర్‌రావుకు అందజేత

**భద్రాచలం సెప్టెంబర్ 07 (జనంసాక్షి)**
భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు భక్తులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. ఇందులో భాగంగా భీమవరం వాస్తవ్యులు చింతలపాటి సీతమ్మ రూ.5 లక్షల



విరాళాన్ని అందజేశారు. ఆలయంలో నిర్వహించే అన్నదాన కార్యక్రమం నిమిత్తం రూ.3 లక్షలు, గోశాల నిర్వహణ కోసం రూ.2 లక్షలు కలిపి మొత్తం రూ.5 లక్షలను విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని ఈఈ రవీందర్ ద్వారా భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం ఈఓ కే. దామోదర్‌రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ కే. దామోదర్‌రావు మాట్లాడుతూ, భక్తులు, దాతలు దేవస్థాన సేవా కార్యక్రమాలకు అందిస్తున్న సహకారం అభినందనీయ మన్నారు. అన్నదానం, గోసంరక్షణ వంటి కార్యక్రమాలకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందించడం ద్వారా మరింత మంది భక్తులకు సేవలందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. శ్రీ సీతారామచంద్రస్వామివారి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్న దాతలకు దేవస్థానం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. భక్తుల సహకారంతో ఆలయంలో ధార్మిక, సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నట్లు ఈఓ పేర్కొన్నారు.

## ప్రజావాణి లో ప్రజా సమస్యపై

## పెనుబల్లిమండల బి ఆర్ ఎస్ పార్టీ ఫిర్యాదు

**పెనుబల్లి సెప్టెంబర్ 7( జనంసాక్షి)**
పెనుబల్లి మండల బి ఆర్ ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యపై మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన వైఫల్యాలపై జరుగుతున్న బిఆర్ఎస్ పార్టీ నిరసన




కార్యక్రమంలో భాగంగా పెనుబల్లి లో జరుగుతున్న ప్రజావాణి కార్యక్రమంలో మండల నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కనగాల వెంకట్రావు, మాజీ జడ్పిటిసి చెక్కిలాల మోహన్ రావు, నాయకులు కోటగిరి సుధాకర్ బాబు, పెనుబల్లి సర్పంచ్ బాణోత్ పాపా లక్ష్మి, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు మందడపు అశోక్ కుమార్, కొప్పుల గోవిందరావు, ఎస్.కె గౌస్, పానెం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

### స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు ఖండనీయం

### మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ

**చంద్రుగొండ, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):**
అసెంబ్లీ వద్ద పోలీసులతో వాగ్వాదం సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధు స్పీకర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లమోతు వెంకటరమణ తెలిపారు. దళిత స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తీవ్ర పదజాలంతో మాట్లాడిన ఎమ్మెల్సీ తాతా మధు వెంటనే క్షమాపణ చెప్పాలని, ఆయన ఎమ్మెల్సీ పదవిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్య నాయక్ తదితర ప్రజాప్రతినిధులు కూడా ఎమ్మెల్సీ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

# 26 ఏళ్లుగా శిథిలావస్థలో గరిడేపల్లి బస్టాండ్

## వసతులు కల్పించాలంటూ ప్రజా సంఘాల నిరసన




**గరిడేపల్లి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):** గరిడేపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ 26 సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరిందని, ప్రయాణికులకు కనీస వసతులు లేవని ఆరోపిస్తూ ఆదివారం ప్రజా సంఘాలు, రాజకీయ పక్షాలు నిరసన చేశారు. 2000 సంవత్సరంలో లక్షల రూపాయలతో నిర్మించిన బస్టాండ్ కు ఇప్పటివరకు మరమ్మతులు కూడా చేపట్టలేదని, పైకప్పు పెచ్చులు ఊడిపడుతూ ప్రమాదకరంగా మారిందని తెలిపారు. బస్టాండ్ లోకి వెళ్లే దారి బురదమయంగా ఉందని లోపల మరుగుదొడ్లు, తాగునీరు, లైట్లు, ఫ్యాన్లు, కుర్చీలు, విచారణ కేంద్రం, సీసీ కెమెరాలు, సూచిక బోర్డులు వంటి సౌకర్యాలు ఏవీ లేవని, ప్రహరీ లేకపోవడంతో అపరిశుభ్రంగా మారి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆరోపించారు. పట్టణ నడిబొడ్డున ఉన్న పోలీస్ స్టేషన్ స్థలంలో నూతన బస్టాండ్ నిర్మించాలని, ప్రస్తుత బస్టాండ్ స్థలంలోకి పోలీస్ స్టేషన్ ను తరలించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్కడ షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మిస్తే ఆర్టీసీకి ఆదాయం వస్తుందని సూచించారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించి, అనంతరం ఎంపీడీవో ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు కొత్తపల్లి రవి, మాజీ మార్కెట్ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి, ఏఐటీయూసీ అధ్యక్షులు బెజ్జం రమేష్, నాయకులు ప్రధాని సైదులు, శంబిరెడ్డి, నకిరేకంటి రవి, ఆలంపల్లి శేఖర్, షేక్ మన్సూర్ అలీ, పెండెం ధనయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా మైదానంలో విద్యార్థుల సత్తా చాటేందుకు సిద్ధం

### క్రీడా ప్రతిభకు వేదికగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా పోటీలు

### ఈ నెల 10, 11 తేదీల్లో మండల స్థాయి క్రీడా పోటీలు



**చింతపల్లి, సెప్టెంబర్ 07(జనం సాక్షి )** విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, వారిని జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయడమే లక్ష్యంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి మాత్య నాయక్ తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ పోటీలు జరగనున్నాయి. ఈ నెల 10వ తేదీన బాలురకు, 11వ తేదీన బాలికలకు అండర్ -14, అండర్ -17 విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్‌తో పాటు అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు (కేజీ వి బి) , గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన అర్హత కలిగిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనే అవకాశం కల్పించారు. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాలలకు చెందిన ప్రతిభావంతులైన క్రీడాకారులను పెద్ద సంఖ్యలో పోటీలకు పంపించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యాశాఖ అధికారులు కోరారు. క్రీడల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లో శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, జట్టు స్ఫూర్తి పెంపొందుతాయని, ప్రతిభ కనబరిచే క్రీడాకారులకు ఉన్నత స్థాయి పోటీల్లో రాణించే అవకాశాలు లభిస్తాయని మండల విద్యాధికారి పేర్కొన్నారు.



## పెద్దమ్మ తల్లి అనుగ్రహంతో పాడిపంటలు పండాలి కాయితి జితేందర్‌రెడ్డి

**చింతపల్లి, సెప్టెంబర్ 07(జనంసాక్షి)** పెద్దమ్మ తల్లి అనుగ్రహంతో పాడిపంటలు పండాలని తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి అన్నారు.. చింతపల్లి మండలం తీదేడు (వెంకటంపేట) గ్రామంలో మల్లికార్జున యాదవ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి పండుగను ఘనంగా నిర్వహించారు. యాదవ సంఘం అధ్యక్షుడు మర్ల యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. పండుగకు ముఖ్యఅతిథిగా తీదేడు మాజీ సర్పంచ్ కాయితి జితేందర్‌రెడ్డి హాజరై పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తీదేడు గ్రామంలో పెద్దమ్మ తల్లి ఆలయం ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. అమ్మవారి అనుగ్రహం ప్రతి ఒక్కరిపై ఉండాలని ఆకాంక్షించారు. పెద్దమ్మ తల్లి దయతో సకాలంలో వర్షాలు కురిసి, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తీదేడు మాజీ సర్పంచ్ దాసరి శ్రీనివాస్ యాదవ్, ఉపసర్పంచ్ ఇడబోయిన వెంకటయ్య యాదవ్, మల్లికార్జున యాదవ సంఘం అధ్యక్షుడు మర్ల యాదగిరి యాదవ్, ప్రధాన కార్యదర్శి ఉడుత శంకర్ యాదవ్‌తో పాటు సంఘం నాయకులు, సభ్యులు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## మాజీ సర్పంచ్ పెండింగ్ బిల్లులు తక్షణమే చెల్లించాలి

### ప్రజావాణిలో అధికారులకు బొమ్మకల్ మాజీ సర్పంచ్ మారుతి వెంకటరెడ్డి వినతి

**మాడ్గులపల్లి, సెప్టెంబర్ 07( జనంసాక్షి ):** తన పదవీ కాలంలో గ్రామంలో పూర్తి చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి న్యాయం చేయాలని మాడ్గులపల్లి మండలం బొమ్మకల్ గ్రామ మాజీ సర్పంచ్ మారుతి వెంకటరెడ్డి అధికారులను కోరారు సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజావాణి అధికారికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మారుతి వెంకటరెడ్డి మాట్లాడుతూ 2019 నుండి 2024 వరకు తన హయాంలో బొమ్మకల్ గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే పలు అభివృద్ధి పనులను సొంత నిధులతో పూర్తి చేసి, రికార్డులు నమోదు చేయించినట్లు తెలిపారు అప్పట్లో పంచాయతీలో తగినంత బడ్జెట్ లేకపోవడంతో బిల్లుల చెల్లింపు నిలిచిపోయిందన్నారు ప్రస్తుతం నిధులు మంజూరవుతున్నప్పటికీ, నూతన సర్పంచ్ సంతకాలు పెట్టకుండా కావాలని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు ఈ విషయంపై గతంలో (ఫిబ్రవరి 23న) దరఖాస్తు చేసినా అధికారుల నుంచి స్పందన లేదని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రికార్డులను పరిశీలించి తనకు రావలసిన బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మాజీ మంత్రుల అక్రమ అరెస్టుకు నిరసనగా మాడుగులపల్లిలో బీఆర్ఎస్ రాస్తారోకో



**మాడుగులపల్లి సెప్టెంబర్ 7 (జనం సాక్షి ):** మాజీ మంత్రులు, ప్రస్తుత ఎమ్మెల్యేలు గుంతకండ్ల జగదీష్ రెడ్డి, తన్నీరు హరీష్ రావుల అక్రమ అరెస్టుకు నిరసనగా మాడుగులపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం భారీ రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని, కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు చర్యలు మానుకోవాలని హితవు పలికారు నాయకులను అరెస్టు చేయడంపై దృష్టి పెట్టడం కాకుండా, రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీల ఆరు గ్యారెంటీలు ప్రకారం , నియామకాలు ఇస్తూ సక్రమంగా పాలన సాగించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు పాలుట్ల బాబయ్య, నిమ్మల నవీన్ రెడ్డి, కందిమల్ల నరేందర్ రెడ్డి, జెరిపోతుల రాములు గౌడ్, పోకల రాజు, మారుతి వెంకటరెడ్డి, కాసిం, గోవింద్ రెడ్డి, ఏడుకొండలు, శ్రీనివాసు, చంటి, రాబర్ట్, సైదులు, సాగర్, అంజయ్య, శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు నిరసన తెలుపుతున్న సమయంలో మాడుగులపల్లి పోలీసులు జోక్యం చేసుకుని నాయకులను పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

## నాంపల్లిలో కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ పార్టీ సమరభేరి

**నాంపల్లి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి)** కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బిఆర్ఎస్ పార్టీ సమరభేరి కార్యక్రమం లో భాగంగా నేడు నాంపల్లిలో మండల బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడపు ,నరసింహారావు ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్ నుండి ర్యాలీగా వెళ్లి మండల పరిషత్ కార్యాలయం లో ప్రజావాణి లో వినతి పత్రాలు అందించటం జరిగింది. కాంగ్రెస్ పార్టీ హామీ నిచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలు పూర్తి స్థాయిలో అమలు చేయాలని, డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం లో భాగమైన కిష్టరాంపల్లి రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని, లక్ష్మణాపురం నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీలో తక్షణమే ఇళ్ల స్థలాలు అందించాలని కోరటం జరిగింది. ఈ కార్యక్రమం లో తుంగపాడు, రేఖ్యాతాండ, పెద్దాపురం సర్పంచ్ లు కదారి శ్రీశైలం యాదవ్, నడింపల్లి యాదయ్య, పల్లె వెంకన్న, బి ఆర్ ఎస్ మండల నాయకులు పోగుల వెంకట్ రెడ్డి, సపవట్ సర్దార్, జిల్లెల్ల సైదులు,పచ్చిపాల రామాంజనేయులు, కామిశెట్టి పాండు, కర్నె యాదయ్య, గుమ్మడపు రామేశ్వర్ రావు, కర్నాటి లింగ స్వామి, గౌరు కిరణ్, గంజి సంజీవ, బిక్షం, ఏడుకొండలు, గోపాల్ రావు, ప్రసాద్, లింగస్వామి, వడత్య నరేష్,నాగేంద్ర, రాము తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రియాంబర్స్ మెంట్ స్కాలర్ షిప్ లు తక్షణమే విడుదల చేయాలి

### ముందస్తు అక్రమ అరెస్ట్ లు అప్రజాస్వామ్యం:బిజెవైఎం నాంపల్లి మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్

**నాంపల్లి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** ఫీజు రియాంబర్స్ మెంట్,స్కాలర్ షిప్ విడుదల చేయాలనీ నేడు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా బిజెపి నాయకులని నాంపల్లి పోలీసులు తెల్లవారుజామున ముందస్తుగా అరెస్ట్ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెవైఎం నాంపల్లి మండల అధ్యక్షులు నాంపల్లి సతీష్ మాట్లాడుతూ ఫీజు రియాంబర్స్ మెంట్, స్కాలర్ షిప్ విడుదల చేయకుండా విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న ఈ ప్రభుత్వానిది సిగ్గుమాలిన చర్య అన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమ అరెస్ట్ లు మాకు కొత్తకాదని,అక్రమ అరెస్ట్ లకు,నిర్బంధాలకి, జైళ్ళకి బిజెపి నాయకులు బయపడరని తెలియజేశారు. అరెస్ట్ అయినా వారిలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు చిరుమామిళ్ల గిరిబాబు, మండల ప్రధానకార్యదర్శి పొలగోని శ్రీకాంత్ గౌడ్ వున్నారు.

## డీజేలకు అనుమతి లేదు: ఎస్సై శ్రీకాంత్ గౌడ్



**గరిడేపల్లి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** గరిడేపల్లి మండల వ్యాప్తంగా ఎలాంటి కార్యక్రమాలకు డీజేలకు అనుమతులు ఇవ్వడం లేదని గరిడేపల్లి ఎస్సై బత్తిని శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. మండలంలోని డీజే నిర్వాహకులకు ఆదివారం పోలీస్ స్టేషన్ లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శబ్ద కాలుష్యం వల్ల వృద్ధులు, చిన్నారులు, గుండె జబ్బులు ఉన్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పెళ్లిళ్లు, ఊరేగింపులు, ఇతర శుభకార్యాల్లో డీజేలు పెట్టరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే డీజే యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినాయక చవితి ఉత్సవాల్లో కూడా డీజేలు ఏర్పాటు చేసే నిర్వాహకులు, యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ప్రశాంత వాతావరణం కోసం పోలీసులకు సహకరించాలని కోరారు.